J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 8 29.7.2022, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి



# వైసిపిలో టిడిపి హవా!

- వలసపక్షులకు ప్రాధాన్యతనిస్తున్న నాయకులు
- అసంతృప్తితో పార్టీ క్యాడర్... పట్టించుకోని లీడర్
- సర్వం, సకలం, సమస్తం తానే అన్న ధీమా.. నవరత్నాలే గెలుపుకి బీమా!

దాదాపు పది సంవత్సరాలు తమ అభిమాన, ఆత్మీయ దివంగత నాయకుడి కొడుకు కోసం ఆయనను ముఖ్యమంత్రిగా చూసుకోవడమే ధ్యేయంగా, అహోరాత్రులు శ్రమించిన రాజశేఖరరెడ్డి అభిమానులు సంతోషంగా ఉన్నారా...? పోరాటపటిమ కలిగిన యువ నాయకుడు, విశ్వసనీయత కలిగిన ఘన నాయకుడి వారసుడు, రేపటి తరం ఆశాజ్యోతి రాజకీయాలలోకి వస్తున్నాడు, ఆయన వెంట నడిస్తే తమకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఆశించిన యువతరానికి ఆ భరోసా లభించిందా...?? మన వాడు.. మన రాజన్న కొడుకు.. మన ఇంటి బిడ్డ అని భావించిన వై.ఎస్. అనుయాయులకు, ఆత్మ బంధువులకు ఆ ఆదరణ లభిస్తోందా..??? పై ప్రశ్నలన్నిటికీ లేదు అనే సమాధానమే చెప్పకతప్పదంటున్నారు రాజకీయ విశ్లేషకులు.

2009 సెప్టెంబర్ 2వ తేదీ మహానేత చివరి శ్వాస తీసుకున్నప్పటినుండి ఆయన మందీమార్బలం అంతా ఆయన కొడుకు జగన్ వైపు నిలిచారు. ఆయన ఓదార్పు యాత్ర చేపట్టినా, కేంద్రప్రభుత్వంపై తిరుగుబాటు చేసినా, కొన్ని నెలలపాటు జైలుపాలై జనజీవనానికి దూరంగా ఉన్నా, మీతోటే మేము.. మీ మాటే మా బాట అన్నట్లుగా జగన్‌మోహన్‌రెడ్డికి బాసటగా నిలిచిన వారెందరో ఉన్నారు. 2014లో ఆయన ఓటమిపాలైన తరువాత కొందరు 'రాజకీయ స్వార్ధపరులు, అవకాశవాదులు' ఆయనకు దూరమయ్యారు తప్ప, నిజమైన అనుచరులు, నిఖార్సయిన నాయకులు, అసలు సిసలైన కార్యకర్తలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయనకు తోడుగా నిలిచారు. జగన్ వెంటే నడిచారు.

కానీ, ఆలా నిలిచిన వాళ్ళు...., ఆయనతో నడిచిన వాళ్ళు పది శాతం మంది కూడా ఆనందంగా లేరన్నది విశ్లేషకుల అభిప్రాయం. పార్టీ కష్ట సమయాల్లో ఉన్న తరుణంలో జగన్ కోసం

10లో

# మాట వినకపోతే వేటే!



- అధికారులతో ఫుట్‌బాల్ ఆడుకుంటున్న నేతలు
- తాము చెప్పినట్లు చేయకపోతే బదిలీలతో వాతలు

నెల్లూరుజిల్లాలో అధికారులుగా పనిచేయడం, అందులోనూ నగర కార్పొరేషనన్‌లో నిష్పాక్షికంగా పనిచేయడమన్నది కత్తిమీద సాములాగా తయారైంది. 'బదిలీకి సిద్ధపడే వారే గట్టిగా పనిచేయాలి' అనే మాటే ఎక్కడబట్టినా వినపడుతోంది. ఇది కొత్త సంగతేమీ కాదు. ఎంతోకాలం నుంచి వస్తున్నదే. గతంలోనూ కార్పొరేషన్‌లో ఎన్నో 'రాజకీయ బదిలీలు' జరిగాయి. రాజకీయ నాయకుల వత్తిళ్ళు తట్టుకుని నిలబడేవాళ్ళకి పర్వాలేదు కానీ, అలాంటి వాటిని పట్టించుకోకుండా నిజాయితీగా నిర్భయంగా పనిచేస్తామంటే నెల్లూరుజిల్లాలో కుదరదు అన్నట్లుగా తయారైంది పరిస్థితి. ఇటీవలే కమిషనర్‌గా వచ్చిన జాహ్నవి విషయంలోనూ అలాగే జరిగి ఉంటుందని నగరంలో చర్చనీయాంశంగా ఉంది. ఆమె వచ్చి సరిగ్గా నాలుగు నెలలు కూడా కాకముందే బదిలీ కాగితం అందుకోవాల్సి వచ్చింది. దీంతో, నగర కమిషనర్‌లు ఎవరు వస్తారో... ఎంత కాలం ఉంటారో తెలియని పరిస్థితి ఏర్పడింది.

3 లో

- హద్దుమీరుతున్న సరిహద్దు తనిఖీలు

# ఆంధ్రా పోలీసుల అత్యుత్సాహం



తెలంగాణ నుండి ఆంధ్రాలోకి ప్రవేశించే జాతీయ రహదారులలో సరిహద్దు తనిఖీల పేరుతో పోలీసులు చేస్తున్న హడావుడి హద్దు మీరుతోందన్న మాట సర్వత్రా వినపడుతోంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి ఒకప్పుడు అసెంబ్లీలో మాట్లాడుతూ 'ఆంధ్రా వాళ్ళు తెలంగాణకు రావాలంటే వీసా తీసుకోవాలా...?' అని ప్రశ్నించారని, కానీ ప్రస్తుతం ఆంధ్రా ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలవల్ల ఆంధ్రా వాళ్ళు ఆంధ్రాలోకి రావాలన్నా సరిహద్దులో తనిఖీలు చేయించుకుని రావాల్సిన దుస్థితి ఏర్పడిందని పలువురు వాపోతున్నారు. మద్యం మాఫియాని అరికట్టడం లక్ష్యంగా ఆంధ్రా పోలీసులు రాష్ట్ర సరిహద్దులో చేస్తున్న తనిఖీలు హద్దు దాటుతున్నాయని ఆరోపిస్తున్నారు.

3 లో


## స్మృత్యంజలి




మా ఇంటి దైవం, మాకు మార్గదర్శకులు

**కీ।।శే।। కైపు నాగిరెడ్డి గారు**

పరమపదించి తేది.01.08.2022ది నాటికి రెండేళ్ళు గడవనున్న సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకుంటూ...

భార్య - కైపు రాజేశ్వరమ్మ

కుమారుడు - కైపు మల్లిఖార్జునరెడ్డి

రాంజీనగర్, నెల్లూరు.

PORTLAND, USA.

మరియు కుటుంబసభ్యులు

# జిఎస్టీపై.. సిపిఎం నిరసన ప్రదర్శన



నిత్యావసర సరుకులపై జిఎస్టీ ఎత్తివేయాలంటూ ఈనెల 22న నెల్లూరులో సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం పేదోళ్ళపై జిఎస్టీలు విధిస్తూ, కార్పొరేట్ కంపెనీలకు మాత్రం రాయితీలిస్తోందని, కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసించాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. నిత్యావసరాలపై జిఎస్టీ విధించడం దారుణమని, వెంటనే దానిని రద్దుచేయాలని నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఒకే పన్ను విధానం తీసుకొచ్చి ప్రజలకు నిత్యావసర సరుకులను అందుబాటులోకి తెస్తామన్న కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందుల పాలుచేస్తోందన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు షేక్ మస్తాన్‌బీ, సూర్యనారాయణ, ఏ.శ్రీనివాసులు, ప్రసాద్, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు. తొలుత నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద నుంచి పప్పులవీధి దాకా సిపిఎం నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించి జిఎస్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# వైకాపా పాలనలో అభివృద్ధి శూన్యం

## - కందుకూరులో టిడిపి నేతల విమర్శ



మూడేళ్ళ వైకాపా పాలనలో అభివృద్ధి శూన్యమని, ముఖ్యంగా గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని కందుకూరు టిడిపి నాయకుడు ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. కందుకూరు నియోజకవర్గం టిడిపి ఆధ్వర్యంలో 'బాదుడే బాదుడు' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇటీవల కందుకూరులో ఇంటింటికీ వెళ్ళి ప్రజలను కలసి వైకాపా పాలనలోని వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీచేశారు. మండల పార్టీ అధ్యక్షులు రోశయ్య, శీను, వెంకటేశ్వర్లు, రమేష్, మాసన్, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి

పోలియో, క్షయ, కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, తట్టు, రూబెల్లా వంటి వ్యాధుల పట్ల ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు ముందస్తు అవగాహన కల్పించాలని, వ్యాధుల నివారణకు టీకాలు వేసేందుకు తయారుగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పెంచలయ్య జిల్లాలోని ప్రాథమిక ఆర్యోగకేంద్రాల వైద్యాధికారులకు సూచించారు.



## నేత్రపర్వంగా.. శ్రీ సుబ్రహ్మణ్యస్వామికి పుష్పయాగం

ఆడికృత్తిక పర్వదినం సందర్భంగా ఇటీవల నెల్లూరు సమీపంలోని కనుపర్తిపాడు గ్రామంలో కొలువైవున్న వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆలయ అర్చకులు అత్యంత వైభవంగా పుష్పయాగం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త వెందోటి చంద్రశేఖర్ రెడ్డి సారధ్యంలో అనేకరకాల పుష్పాలతో ఈ పుష్పయాగ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు కందాల శ్రావణకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి అమ్మవార్లకు ఉష:కాల పూజలు, పంచామృతాభిషేకాలు విశిష్ట పూజలు జరిగాయి. కనుపర్తిపాడు నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

## మరో 6 నెలలు.. పదవీకాలం పొడిగింపు


డిసిసిబి (జిల్లా కేంద్ర సహకార బ్యాంకు), డిసిఎంఎస్ (జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ)ల పాలకవర్గాల పదవీకాలాన్ని ప్రభుత్వం మరో 6 నెలల పాటు పొడిగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. డిసిసిబి అధ్యక్షునిగా కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మెన్‌గా వీరి చలపతి ఛైర్మెన్‌లుగా ఉండడం తెలిసిందే. డిసిసిబి పాలకవర్గానికి ఈనెల 17న, డిసిఎంఎస్ పాలకవర్గానికి ఈనెల 22తో పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం తాజాగా వారి పదవీకాలం పొడిగించింది.

## నెలరోజులవుతున్నా.. పాఠ్యపుస్తకాలు రాలేదు

జిల్లాలో పాఠశాలలు తెరచి నెలరోజులవుతున్నా పాఠశాలలకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు అందలేదని, వెంటనే పుస్తకాలు అందజేయాలని ఎపిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వివిఎస్ చైతన్య ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా విద్యాశాఖ ఏ.డి గ్లోరికుమారికి వినతిపత్రం సమర్పించారు. సాయి, నరేంద్ర, సునీల్, దీక్షిత్ పాల్గొన్నారు.

## నారాయణరెడ్డిపేటలో చేనేత మగ్గాల పరిశీలన

నెల్లూరు సమీపంలో ఉన్న నారాయణరెడ్డిపేటలో ఈనెల 23న చేనేత–జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆనంద్‌కుమార్ పర్యటించి నేత మగ్గాలను పరిశీలించారు. చేనేతకారుల సమస్యలను తెలుసుకున్నారు. జిల్లాలో అర్హులైన చేనేతకారులందరికీ 'నేతన్న నేస్తం' పథకాన్ని అందజేస్తామని, ఈ పథకంలో ఇంకా లబ్ధిపొందని వారుంటే వారిని కూడా గుర్తించి ఈ పథకం అందేలా చేస్తామని ఆయన చెప్పారు.

# మాట వినకపోతే వేటే!

(మొదటి పేజీ తరువాయి)

నిజానికి కమిషనర్‌గా జాహ్నవి వచ్చినప్పటినుంచి కార్పొరేషన్‌లో కదలిక మొదలైంది. కాలువల్లో పూడికలు తీయించడం, రోడ్ల గుంతలు పూడ్పించడం, నిత్యం రోడ్లమీదకి వచ్చి పారిశుద్ధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవడం ఆమె దినచర్యగా ఉండేది. కార్పొరేషన్ పనుల వేగం పెంచేందుకు, కార్పొరేషన్ పాలనను చక్కదిద్దడానికి ప్రయత్నించే చర్యల్లో భాగంగా ఎప్పటినుంచో పలు విభాగాల్లో తిష్టవేసుకుని కూర్చున్న వారిని మార్చేందుకు సిద్ధపడడంతోనే ఆమెకు అసలు చిక్కు వచ్చిపడినట్లుంది. కార్పొరేషన్‌లో ఏళ్ళతరబడి పనిచేసేవాళ్ళకు రాజకీయ నాయకుల అండదండలు పుష్కలంగా ఉండడం అందరికీ తెలిసిందే. వాళ్ళ జోలికి వెళ్తే ఎంతటి కచ్చితమైన అధికారికైనా బదిలీ తప్పదు. కార్పొరేషన్‌ను ప్రక్షాళన చేసి ప్రజలకు మంచిపాలన అందించాలని ఎవరు భావించినా ఆ ప్రయత్నాలు ఒక కొలిక్కి వచ్చేలోగానే బదిలీ అయిపోతుండడం నెల్లూరులో మామూలే. జాహ్నవి బదిలీలోనూ ఇలాంటి రాజకీయాలే పనిచేసి ఉంటాయనుకుంటున్నారు ప్రజలు. దీంతో కార్పొరేషన్‌లో కమిషనర్‌లు ఎంతకాలం పనిచేస్తారో అన్న విషయం డోలాయమానంగా మారింది.

ఆర్డీఓ కొండయ్య పరిస్థితి కూడా అదే. ఆయన వచ్చి కూడా నాలుగు నెలలు కాలేదు. ఇంతలోనే ఆయనకూ బదిలీ తప్పలేదు. సమర్థవంతంగా పనిచేస్తున్నారనే మంచిపేరు వీళ్ళిద్దరికీ ఉంది. ఇక్కడ కాకపోతే ఎక్కడైనా అలాంటి అధికారులు తమ విధులు తాము నిర్భయంగా సమర్థవంతంగానే చేసుకుని పోతుంటారు. బదిలీ చేసినంత మాత్రాన వారికేమీ నష్టం లేదు. పనిచేసే అధికారులను పంపించేస్తే నష్టం ప్రజలకే. పాలనాపరంగా బదిలీలు ఎవరికైనా సహజమే. కానీ, తమ ఆధిపత్యం నిరూపించుకోవడానికి మంచి అధికారులను కూడా రాజకీయ కారణాలతో బదిలీలకు గురిచేస్తున్నారని, దీంతో చివరికి ప్రభుత్వానికే చెడ్డపేరు వస్తుందనే విమర్శలు ప్రజల్లో వెల్లువెత్తుతున్నాయి. ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోకుండా, తమ మాటవినని అధికారులను బదిలీచేయించడమే పనిగా పెట్టుకునే నాయకులు.. ఇది ఎంత వరకు మంచిదో ఇకనైనా ఆలోచించుకోవాలి.

## కమిషనర్ జాహ్నవి.. రంపచోడవరానికి

నెల్లూరు నగరపాలక సంస్థకు ప్రభుత్వం కొత్త కమిషనర్‌ను నియమిస్తూ తాజాగా ఉత్తర్వులిచ్చింది. ఇప్పటిదాకా పనిచేస్తున్న కమిషనర్ జాహ్నవిని రంపచోడవరం ఐటిడిఏ పి.ఓగా బదిలీ చేశారు. గత ఏప్రిల్‌లో ఆమె నెల్లూరు కమిషనర్‌గా రావడం జరిగింది. నాలుగు నెలలు కూడా గడవకముందే స్థానచలనం కలిగింది.

## కొత్త కమిషనర్‌గా హరిత



శ్రీకాళహస్తి ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న దామలచెరువు హరితను నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈమె గతంలో నెల్లూరు ఆర్డీఓగా, డ్వామా పీడీగా పనిచేశారు కనుక నెల్లూరు సంగతులన్నీ ఆమెకు తెలిసినవే.

## ఆర్డీఓ కొండయ్య..అనంతపురానికి

నెల్లూరు ఆర్డీఓగా పనిచేస్తున్న కొండయ్యను ప్రభుత్వం శ్రీ సత్యసాయి జిల్లా (పాత అనంతపురం) డిఆర్‌ఓగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో నెల్లూరు ఆర్డీఓగా ఏ.మలోలా నియమితులయ్యారు.

## సుందర ముదనష్టంగా.. నెల్లూరు



నెల్లూరు నగరాన్ని సుందరనందనంగా తీర్చిదిద్దుతామని ఏళ్ళ తరబడిగా నాయకులు ఊకదంపుడు మాటలు చెప్తూ, నగర ప్రజలను మభ్య పెడుతూనే ఉంటారని, రోడ్లు గుంతలు పడిపోయినా, మురుగు కాలువలు పూడిపోయి పారిశుద్ధ్యం పరమ అధ్వాన్నంగా తయారై నగరం మురుగుదిబ్బగా గబ్బుకొట్టి పోతున్నా, ఒక్కమాటలో చెప్పాలంటే నెల్లూరు నగరం నరకానికి నకలుగా మారిపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుచేస్తామని, నెల్లూరు నగరంలో మురుగు అన్నదే కనపడకుండా చూస్తామని చెప్పిన నాయకులు, అధికారులు ఏళ్ళు గడిచిపోతున్నా నగరాన్ని సుందరముదనష్టంగానే ఉంచుతున్నారు తప్ప, ఏ ఒక్కరూ బాగు చేసింది లేదు. అలాంటి ఉత్తుత్తి మాటలు విని విని నగరప్రజలు విసిగిపోయారు.

చిన్నవానొస్తే చాలు, నగరంలోని ప్రధానరోడ్లు సైతం మురుగు కాలువల్లాగా తయారవుతాయి. కాలుపెడితే చాలు జర్రున జారిపోయే మురుగుతో రోడ్లు గబ్బుకొట్టిపోతాయి. రోతపుట్టే ఆ రోడ్లలో నడిచే వాళ్ళకి ఆ బాధలు తెలుస్తాయి. ఎప్పుడో పాత కాలంలో ఏసి సుబ్బారెడ్డి హయాంలో నెల్లూరులో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుచేసి పుణ్యం కట్టుకున్నారు. డంపింగ్‌యార్డులు కూడా అప్పట్లోనే సిద్ధం చేశారు. ఆ తర్వాత కాలక్రమంలో ఆ పైపులైన్లు వగైరాలన్నీ తుప్పుపట్టిపోయాయి. వాటన్నిటినీ మార్చి, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటుచేస్తే తప్ప నెల్లూరునగరం మురుగు నుంచి విముక్తి కాదనే విషయం అందరికీ తెలిసిందే. గత ప్రభుత్వంలో కొంతమేరకు పనులు ప్రారంభమైనా, కొత్త ప్రభుత్వం వచ్చేసరికి ఎక్కడివక్కడ బంద్ అయిపోయాయి. పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది. అనేక మురుగుకాలువలు ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి పరమ దుర్గంధంగా ఉన్నా, పంట కాలువలు పూడిపోయినా, వీధులన్నీ మురుగుతో నిండి పోతున్నా పట్టించుకునే నాధులే కరువయ్యారిప్పుడు. మురుగు కాలువల్లో నెలలతరబడి చెత్త పేరుకుపోతుండడంతో ఎక్కడ బట్టినా దోమలే. 'స్వచ్ఛ నెల్లూరు' అన్న మాట వినడమే తప్ప.. ఎక్కడా కలికానికి కూడా అది కనపడదు. అధికారులెవరైనా ఈ దుస్థితిని చక్కదిద్దాలనుకుంటే..ఇదిగో ఇలాంటి బదిలీలు తప్పడం లేదంటున్నారు. ఇకనైనా నెల్లూరులో భయంకరంగా పేరుకు పోతున్న మురుగును, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు, పచ్చదనం-పరిశుభ్రత వెల్లివిరిసేందుకు, తద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు, స్వచ్ఛంధసంస్థలు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కలసి యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకోకుంటే రానున్న కాలంలో ఇక ఎవ్వరూ బాగుచేయలేనంత దౌర్భాగ్య నగరంగా.. నెల్లూరు.. 'మురుగూరు'గా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## ఆంధ్రా పోలీసుల అత్యుత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

భారీ వాహనాలను వదిలేసి కుటుంబసభ్యులతో కలిసి వస్తున్న కార్లను పోలీసులు ఆపడం అర్థరహితం. మహిళలను సైతం కార్లలో నుంచి దించి వారి హ్యాండ్‌బ్యాగులు కూడా తనిఖీలు చేయడం చూస్తుంటే తాము భారతదేశంలో ఉన్నామా.. లేక వేరే దేశం నుండి ఆంధ్రాలోకి వస్తున్నామా...? అన్న అనుమానం కలుగుతోంది. కేవలం తెలంగాణ నుండి ఆంధ్రాకి వచ్చే సరిహద్దులలోనే ఈ హడావుడి ఎక్కువగా ఉంది. తమిళనాడు, కర్ణాటక నుండి వస్తున్నప్పుడు తనిఖీలు ఉన్నా ఇంత హడావుడి లేదు. మద్యం వ్యాపారం చేసేవారు ఖరీదైన కార్లలో కుటుంబసభ్యులతో రారు, పైగా మహిళల హ్యాండ్‌బ్యాగులలో మద్యం తెచ్చే స్థాయికి దిగజారరు. ఆ మాత్రం కనీస అవగాహన కూడా లేకుండా పోలీసులు ప్రవర్తిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. సంబంధిత అధికారులు కల్పించుకుని ఈ తనిఖీలకు ఒక నియమావళి రూపొందించుకుంటే బాగుంటుందని ఇరు రాష్ట్రాల మధ్య నిత్యం ప్రయాణించే ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

### ఏపి ఇఏపి సెట్‌లో..

## కృష్ణచైతన్య హవా

ఏపి ఇఏపి సెట్ ఫలితాల్లో నెల్లూరులోని కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకున్నారు. తమ విద్యార్థి మునివెంకట్ రాష్ట్రస్థాయిలో 3913వ ర్యాంకును, ఖుషిజైన్ 4585, సత్యయశ్వంత్ 4825, రాకేష్ 4997వ ర్యాంకులు సాధించారని, 10వేల లోపు ర్యాంకులను 17 మంది విద్యార్థులు సాధించడం సంతోషకరమని కృష్ణచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్లు డా.ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలు తెలియజేస్తూ, ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## 29న నెల్లూరు కార్పొరేషన్ సమావేశం

నెల్లూరు కార్పొరేషన్ (నగరపాలక సంస్థ) కౌన్సిల్ సమావేశం ఆగస్టు 29 శుక్రవారం నాడు జరుగుతుందని నగర మేయర్ స్రవంతి తెలిపారు. రొట్టెలపండుగ నిర్వహణ గురించి, నగరంలోని పలు డివిజన్లలో సమస్యల గురించి చర్చించనున్నామని, కార్పొరేటర్లందరూ హాజరు కావాలని ఆమె కోరారు.



## మన వెంకయ్య నిరాడంబరత

తాను ఎప్పుడు ఎక్కడ ఏ హోదాలో ఉన్నా, ఎదిగేకొద్దీ ఒదగాలన్న తత్వాన్ని పాటించే భారత ఉపరాష్ట్రపతి మన నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్య నాయుడు మరోసారి తన నిరాడంబరతను చాటుకున్నారు. భారత 15వ రాష్ట్రపతిగా ఎన్నికైన ద్రౌపదిముర్మును పదవీబాధ్యతలు చేపట్టకముందే ఉపరాష్ట్రపతి హోదాలో ఆమె ఇంటికి వెళ్ళి కలసి అభినందనలు తెలియజేశారు. దటీజ్ వెంకయ్య!...



## అబ్దుల్‌కలాం జీవితం.. అందరికీ ఆదర్శప్రాయం



మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్‌కలాం జీవితం మార్గదర్శకమని, ఆ మహనీయుని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని విక్రమసింహపురి యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ఆచార్య జిఎం సుందరవల్లి అన్నారు. ఈనెల 27న అబ్దుల్‌కలాం 7వ వర్ధంతిని పురస్కరించుకుని విఎస్‌యులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత అంతరిక్ష పరిశోధనలో శాస్త్రవేత్తగా అబ్దుల్‌కలామ్ భారత్‌కు ఎన్నో ఘనవిజయాలు సాధించిపెట్టారని, చిన్నతనం నుంచి కష్టాల్లో ఎదిగి, నిరంతర కృషి పట్టుదలతో, ప్రతిభాపాటవాలతో రాణిస్తూ, దేశంలోనే అత్యున్నతమైన రాష్ట్రపతి పీఠాన్ని కూడా అధిష్టించి దేశానికి అపారమైన సేవలందించారని ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో విఎస్‌యు రిజిస్ట్రార్ డా. రామచంద్రారెడ్డి, అధ్యాపకులు, విఎస్‌యు సిబ్బంది పాల్గొన్నారు.

## మొక్కలు నాటండి..పచ్చదనాన్ని కాపాడండి




మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని కాపాడండంటూ జిల్లా యువజనశాఖ, సెట్నెల్, పిఎంపి అసోసియేషన్‌ల వారు సంయుక్తంగా ఈనెల 28వ తేది గురువారం నెల్లూరులో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం సందర్భంగా నగరంలోని వేదాయపాళెంలో ఉన్న సుస్మిత నర్సింగ్ కళాశాలలో ఈ కార్యక్రమం జరిగింది. సెట్నెల్ సిఇఓ డి.పుల్లయ్య సదస్సును ప్రారంభించారు. అటవీశాఖ రేంజ్ అధికారి కె. శివరామకృష్ణ మాట్లాడుతూ, చెట్లను నరికివేయడం వల్ల పర్యావరణం దెబ్బతిని కాలుష్యం పెరిగిపోతుందని, అందువల్ల చెట్లను పరిరక్షించుకోవాలని, ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ ఏ.మహేంద్రరెడ్డి, పిఎంపిల సంఘం గౌరవాధ్యక్షులు జయప్రకాష్, అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్, ఫారెస్ట్ డెప్యూటి రేంజ్ అధికారి మాల్యాద్రి, సెట్నెల్ మేనేజర్ శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. తొలుత నర్సింగ్ కళాశాల విద్యార్థులు స్థానిక చాణుక్యపురి నుంచి వేదాయపాళెం మీదుగా కళాశాల వరకు ర్యాలీ నిర్వహించి ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగించారు.

లాయర్
జులై 29, 2022

# అత్యున్నత పీఠంపై.. గిరిపుత్రిక



భారతదేశ 15వ రాష్ట్రపతిగా గిరిపుత్రిక ద్రౌపది ముర్ము విజయం సాధించడం, రాష్ట్రపతి భవన్‌లోకి సగర్వంగా అడుగిడడం చరిత్రాత్మకం. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశాల్లో ఒకటైన భారతదేశానికి గిరిజన మహిళ రాష్ట్రపతి కావడం దేశప్రజలందరికీ గర్వకారణం. ఇదెంతో అపూర్వమైన విషయం. భారతదేశంలోనే ఒక అద్భుతమైన ఘట్టం. పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ముతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మన తెలుగు వారైన చీఫ్‌జస్టిస్ ఎన్‌వి రమణ ప్రమాణస్వీకారం చేయించడం గొప్ప విశేషం.

*"భారతదేశంలో పేదప్రజలు కేవలం కలలు కనడమే కాదు.. వాటిని కచ్చితంగా సాకారం చేసుకోగలరు అని చెప్పడానికి రాష్ట్రపతిగా నా ఎన్నికే ఒక సాక్ష్యం. నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించిన ఒక మహిళ అత్యున్నత రాజ్యాంగ పదవిని చేపట్టడం దేశ ప్రజాస్వామ్యశక్తికి ఒక నిదర్శనం"*
**...రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

భారతదేశ 15వ రాష్ట్రపతిగా గిరిపుత్రిక ద్రౌపది ముర్ము విజయం సాధించడం, రాష్ట్రపతి భవన్‌లోకి సగర్వంగా అడుగిడడం చరిత్రాత్మకం. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యదేశాల్లో ఒకటైన భారతదేశానికి గిరిజన మహిళ రాష్ట్రపతి కావడం దేశప్రజలందరికీ గర్వకారణం. ఇదెంతో అపూర్వమైన విషయం. భారతదేశంలోనే ఒక అద్భుతమైన ఘట్టం. పార్లమెంట్ సెంట్రల్‌హాల్‌లో ద్రౌపది ముర్ముతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మన తెలుగువారైన చీఫ్‌జస్టిస్ ఎన్‌వి రమణ ప్రమాణస్వీకారం చేయించడం గొప్ప విశేషం. "రాష్ట్రపతి పదవి లభించడం కేవలం నా వ్యక్తిగత విజయం కాదు. ఇది దేశంలోని ప్రతి నిరుపేద సాధించిన ఘనత. అణగారిన వర్గాలు, పేదలు, దళితులు, గిరిజనులు వారి ప్రతిబింబాన్ని నాలో చూసుకో గలగడం నాకెంతో సంతృప్తి నిస్తోంది".. అంటూ ముర్ము తన తొలి ప్రసంగంలోనే దేశప్రజలను బాగా ఆకట్టుకున్నారు. అంతేకాదు, 'ఒడిశా రాష్ట్రంలో మారుమూల ప్రాంతంలో చిన్న గిరిజన గ్రామంలో పుట్టి పెరిగా. అక్కడ ప్రాథమిక విద్యనభ్యసించడం కూడా ఒక కలే. మా గ్రామం నుంచి కాలేజీలో చేరిన తొలి విద్యార్థిని నేనే. అలాంటి నేను రాష్ట్రపతి స్థానానికి చేరుకోవడం మన ప్రజాస్వామ్యం గొప్పతనం, ప్రజాస్వామ్యానికే తల్లి అయిన భారత్ గొప్పతనం'..అంటూ ఎంతో వినమ్రంగా చెప్పారామె. తన జీవితప్రస్థానాన్ని అరమరికలు లేకుండా చెప్పడం, ఆమె నిరాడంబర తత్వాన్ని, నిజాయితీని చూసి దేశ ప్రజలు జేజేలు పలికారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జన్మించిన తొలి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కావడం, అందులోనూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ళు పూర్తయి దేశవ్యాప్తంగా గొప్పగా అమృతోత్సవాలు జరుపుకుంటున్న వేళ ఆమె రాష్ట్రపతిగా అత్యున్నత పదవీ బాధ్యతలు చేపట్టడం మరో విశేషం.

ఒడిశాలోని మయూర్‌భంజ్ జిల్లాకు చెందిన ఊపర్‌బేడా అనే మారుమూల కుగ్రామంలో గిరిజన జాతికి చెందిన సంతాల్ కుటుంబంలో 1958 జూన్ 20న ఆమె జన్మించారు. డిగ్రీ పూర్తయ్యాక ఉపాధ్యాయురాలిగా జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత 1997లో భారతీయ జనతా పార్టీలో చేరి రాజకీయాల్లో ప్రవేశించారు. ఒడిశాలోని రాయ్‌రంగపూర్ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీచేసి గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. ఆ తర్వాత మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఎమ్మెల్యేగా, మంత్రిగానే కాక, గవర్నర్‌గా కూడా బాధ్యతలను అత్యుత్తమంగా నిర్వహించిన ఘనత ఆమెదే. జార్ఖండ్ గవర్నర్‌గా నియమితురాలైన ఆమె ఆ రాష్ట్రానికి తొలి మహిళా గవర్నర్‌గా ఉంటూ ఎంతో సమర్థవంతంగా పనిచేసి ప్రజల అభిమానాన్ని పొందారు. అంతటి విశిష్టమైన మహిళామూర్తి ద్రౌపది ముర్మును ఎన్డీఏ రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రధాని మోదీ, బిజెపి నేతలు ఎంపిక చేయడం పట్ల దేశప్రజలకే కాదు, విపక్షాల్లోని వారికి కూడా సంతోషం కలిగించిందంటే ముర్ము ఆదర్శప్రాయమైన జీవితానికి అదో మచ్చుతునక. అంతేకాదు, ఆమె జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. విధివశాత్తూ తన ఇద్దరు కుమారులు, భర్త మరణించడం ఆమె జీవితంలో ఒక పెద్ద సునామీ. ఆ విషాదం ఆమెను అంతులేని ఆవేదనకు గురిచేసింది. ప్రస్తుతం ఆమెకు ఒక కుమార్తె ఉన్నారు. ఏదేమైనా జీవితంలో ఎన్నో కష్టనష్టాలను అధిగమిస్తూ, అంతులేని ఆత్మవిశ్వాసంతో ఆమె జీవనపయనం సాగించారు. అట్టడుగు నుంచి అత్యున్నత స్థాయికి ఎదిగారు. ఆమె జీవితప్రస్థానం అందరికీ మార్గదర్శకం. ఆమె భారత రాష్ట్రపతి కావడం భారత ప్రజల అదృష్టం. ఇప్పటికే దేశంలో కోట్లాదిమంది గిరిజనులు ఇంకా సమస్యల సుడిగుండాల్లోనే ఉన్నారు. ఎలాంటి ఎదుగుబొదుగూ లేకుండా కొండకోనల్లో జీవిస్తూ ఎన్నో అవస్థలు పడుతూనే ఉన్నారు. కనీసం విద్యుత్ సౌకర్యాలు, ప్రాథమిక సదుపాయాలు లేక ఎంతోమంది జీవితాలు అంధకారబంధురంగానే ఉన్నాయి. నిరుపేదల కష్టాలు తెలిసిన మానవతామూర్తి ముర్ము రాష్ట్రపతి కావడంతో ఇకనైనా వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయని, వారి కలలు ఫలిస్తాయని ఆశిద్దాం!.

## నియంత్రణ లేని జంక్ ఫుడ్ సెంటర్లు



ఇటీవల కాలంలో జంక్ ఫుడ్ల జాతర నడుస్తోంది. ఎక్కడ చూసినా వయసుతో నిమిత్తం లేకుండా చిన్నా పెద్దా ఇప్పుడు ఫుడ్‌కోర్టులకు క్యూ కడుతున్నారు. షాపింగ్ కాంప్లెక్సుల్లోనూ రోడ్డు మార్జిన్లలోనూ పుట్టలుపుట్టలుగా జంక్‌ఫుడ్ జంక్షన్లు దర్శనమిస్తున్నాయి. ఎక్కడో అరా కొరా తప్ప బూతద్దం పెట్టి వెతికినా ఎక్కడా ఆహారంలో స్వచ్ఛత, పరిసరాలలో శుభ్రత కనిపించదు. రోడ్డు పక్కన, టీ దుకాణాల ముందు స్టవ్‌లు పెట్టి వండి వడ్డించేస్తున్నారు. మొబైల్ హాట్‌ఫుడ్ సెంటర్లు కూడా కోకొల్లలుగా తెరుచుకుంటున్నాయి. ఒక వాహనంలోనే అన్ని సదుపాయాలు సమకూర్చుకుని ఎక్కడ జనాభా ఎక్కువగా గుమికూడితే అక్కడ దుకాణం తెరిచేస్తున్నారు. ఒక పదార్థం తయారుచేయడానికి వాడే వంట నూనెనే పదే పదే వాడేస్తున్నారు.

## సమస్యల తో 'రణం'

వేడిగా రుచికరంగా ఉన్న వంటకాన్ని ఆనందిస్తూ తింటున్న ఆహారప్రియులు అవి తయారుచేస్తున్న విధానాన్ని, నిల్వచేసి అమ్ముతున్న పద్ధతులని అస్సలు పట్టించుకోవడం లేదు. నిత్యం వాహనాలు తిరిగే ప్రధాన రహదారులలో అయితే మరీ ఘోరం. ఆ వాహనాల నుండి వచ్చే కలుషితమైన పొగ, వాహనాలు వచ్చి వెళ్లే సమయంలో రేగే దుమ్ము, ధూళి అంతా సదరు పదార్థాలపైనే ఉంటుంది. ప్రజల అవసరాలకు, అభిరుచులకు అనుగుణంగా వ్యాపారాలు చేసుకోవడం తప్పు కాదు. చేసే పనిలో నాణ్యత చాలా అవసరం. ముఖ్యంగా ఆహార రంగంలో నాణ్యతా నిబంధనలు పాటించడం చాలా అవసరం. నేతల అండతోనో, అధికారులకు ఇచ్చే లంచాలతోనో తాము పబ్బం గడిపేసుకోవడం సబబు కాదు. ప్రజలు తమకు చెల్లించే పైకానికి తగ్గ ఆరోగ్యవంతమైన ఆహారం అందించడం కూడా వ్యాపారస్తుల కనీస బాధ్యత. నగర కార్పొరేషన్‌లో ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం 'పబ్లిక్ హెల్త్' పేరుతో ఒక ప్రత్యేక విభాగమే ఉంది. గతంలో వెంకటరమణ అనే అధికారి విస్తృత స్థాయిలో హోటళ్ళు, ఫుడ్‌కోర్టులు, చిన్న చిన్న ఆహార కేంద్రాలపై దాడులుచేసి తనిఖీలు జరిపి వారిలో ప్రజల ఆరోగ్యం పట్ల చైతన్యం కలిగించడంతోపాటు ఒక భయాన్ని కూడా కల్పించాడు. అదే తరహాలో అధికారులు పనిచేయకపోతే, నాణ్యత లేని ఆహారం తిని ఆసుపత్రుల పాలవుతున్న ఆహార ప్రియుల అనారోగ్య పాపం ఫలితం వాళ్ళే మూటకట్టుకోవలసి ఉంటుంది.

**- సంచారి**

## వసతులు కల్పించాలి



**నిరసన తెలుపుతున్న బిజెపి నాయకులు**

గూడూరు పట్టణ సమీపంలోని వేములపాళెం గిరిజన కాలనీలో వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బిజెపి నాయకుడు బాలకృష్ణంనాయుడు తెలిపారు. గూడూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మహిళలతో కలిసి ఈ నెల 25వ తేదీ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, సురేష్, సురేష్ కుమార్‌రెడ్డి, గోపికృష్ణ, రమేష్, శ్రీనివాసరావు, బాలమణి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు చీరల పంపిణీ

స్నేహితులను గుర్తుంచుకొని వారి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ తెలిపారు. గూడూరు పట్టణంలోని సివిసి పార్కు ప్రాంగణంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సాయితేజ గౌడ్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ 200 మంది పేదలకు చీరలను పంపిణీ చేశారు. కమిషనర్ సాయినాథ్ మాట్లాడుతూ చిన్నతనంలోనే కుటుంబ సభ్యులకు సాయితేజ దూరం కావడం దురదృష్టకరమన్నారు. కుటుంబసభ్యులు మనోధైర్యంతో సేవా కార్యక్రమాలు చేయడం గొప్పతనమని కొనియాడారు. దువ్వూరు రవీంద్రరెడ్డి, మురళీ, శ్రీనివాసులుగౌడ్, సురేష్, మల్లిఖార్జున్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీని బీజేపీ శాసిస్తోందా? లేక భాజపాకి వైకాపా లొంగిపోయిందా??




పై రెండు ప్రశ్నలకి అర్థం ఒకటే... కానీ పరమార్థమే నాకు అర్థంకావడంలేదు. భాజపాకి వైకాపా లొంగిపోయింది కాబట్టే బీజేపీ వైసీపీని శాసిస్తోంది. ఇది బహిరంగ రహస్యం. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీకి ఎప్పుడు ఎక్కడ అవసరమొచ్చినా మద్దతు ఇస్తూ వారి కోరికలు తీరుస్తున్నాడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. కేంద్ర పెద్దలు అడిగితే రాజ్యసభ సభ్యత్వాలని ఇస్తున్నాడు, టీటీడీ మెంబర్లుగా వాళ్ళు చెప్పిన వారిని నియమిస్తున్నాడు, ఉభయసభలలో కేంద్రం ప్రవేశపెట్టే బిల్లులకు మద్దతు తెలుపుతున్నాడు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలలో మోడీ – షా – నడ్డా త్రయం ఎవరికి ఓటెయ్యమంటే వాళ్ళకే ఓటేస్తున్నాడు. కానీ... అనాథగా మారి, అన్ని విధాలా అవసాన దశకు చేరుకుంటున్న ఆంధ్ర హక్కులు సాధించుకోవడంలో మాత్రం విఫలమవుతున్నాడు. రాష్ట్రానికి అవసరమైన నిధులు తెచ్చుకోలేకపోతున్నాడు, ప్రత్యేకహోదా సాధించుకోలేక పోతున్నాడు, విభజన హామీలు నెరవేర్చుకోలేకపోతున్నాడు, విశాఖ ఉక్కును కాపాడుకోలేకపోతున్నాడు ఇలా అనేక అంశాలలో ఆయన అభాసుపాలవుతూనే ఉన్నాడు. 'మా ఇంటికి వస్తూ మాకేం తెస్తావ్ – మీ ఇంటికి వస్తే నాకేం ఇస్తావ్' అన్నట్లుగా భాజపా – వైకాపా బంధం కొనసాగుతోంది. మరి ఈ పవిత్ర బంధం వెనుక ఉన్న విచిత్ర సంబంధం ఏమిటో వారికే తెలియాలి!

*ఎం. అనిల్‌కుమార్‌రెడ్డి*, **హైదరాబాదు.**

## అవును అవి మోడీ సింహాలే!

గతవారం లాయర్‌లో 'మనలో మాట'లో 'ఇవి మోడీ సింహాలే' అని భోగాది వారు వ్యక్తపరచిన అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను. కొత్త పార్లమెంటు భవనంపైన ఏర్పాటుచేసిన ఆ నాలుగు సింహాలలో మనకు చూసే మూడు సింహాలలో క్రూరత్వం స్పష్టంగా కనిపిస్తుంది. సింహం క్రూరజంతువే, అంతమాత్రాన జాతీయ చిహ్నంలో అలా చూపించాల్సిన అవసరం లేదు. అన్ని సింహాలూ ప్రశాంతంగా కూర్చుని ఉన్న పాత చిహ్నం స్థానంలో ఇలా రౌద్రంతో గర్జించే సింహాలను ఏర్పాటు చేయడంలో ఆంతర్యం ఏమిటో కాషాయ నేతలకే తెలియాలి. వారి ఆంతర్యం, ఆలోచనా ఏదైనా ఇది దేశ భవిష్యత్తుకి మంచిది కాదు. ఒక హెచ్చరిక లాగా ప్రస్ఫుటిస్తున్న ఆ సింహాల ముఖకవళికలు ఏదో ప్రమాదాన్ని సూచిస్తున్నాయన్నది మాత్రం నిజం. ఈ చిహ్న స్వరూపం భాజపా నేతల స్వభావాన్ని తెలియజేస్తుంది. ఈ అంశాన్ని మేధావులు, మీడియా ఎవరికి తోచిన రీతిలో వారు విశ్లేషిస్తున్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తికో లేక పార్టీకో చెందిన అంశం కాదు. దేశ ప్రజల మనోభావాలకు సంబంధించిన విషయం. అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని ఢిల్లీ పెద్దల అంతరంగంలో ఉన్న దురాలోచనకి అడ్డుకట్ట వెయ్యాలి. వెంటనే కొత్త చిహ్నం స్థానంలో పాత సింహాల తరహా చిహ్నాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలి.

*యం. చంద్రమౌళి*, **కొత్తఢిల్లీ.**

## జస్టిస్ రమణగారు బాగా చెప్పారు!

ఎలక్ట్రానిక్ మీడియా మరియు సామాజిక మాధ్యమాలు తొక్కుతున్న వెర్రిపుంతల మీద ఇటీవల సుప్రీం కోర్టు చీఫ్‌జస్టిస్ ఎం.వి.రమణ గారు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 'సామాజిక మాధ్యమాలలో చాలామంది తీర్పులు కూడా ఇచ్చేస్తున్నారంటూ' చురకలు అంటించారు. 'ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సామాజిక మాధ్యమాలు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తూ కోర్టులను, వ్యవస్థలను తప్పుదోవ పట్టిస్తున్నాయని' మండిపడ్డారు. నిజానికి అటు ఎలక్ట్రానిక్ మీడియా అయినా ఇటు సామాజిక మాధ్యమాలైనా పూర్తిగా వ్యక్తిగత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమాచారానికి ప్రాచుర్యం కల్పిస్తున్నారు తప్ప, సమాజ హితం పూర్తిగా కరువయ్యింది. ఆయన చెప్పినట్లుగా ప్రభుత్వాల్లో, న్యాయస్థానాల్లో జోక్యం చేసుకుని ఈ ఒరవడికి అడ్డుకట్ట వేయకపోతే రాజ్యాంగ వ్యవస్థలు సైతం ప్రమాదంలో పడే పరిస్థితులు ఎదురవుతాయి. తస్మాత్ జాగ్రత్త ...!

*దశరథ్*, **తిరుపతి.**

## పాఠకులకు మనవి..!

మన లాయర్ పత్రికలో ప్రచురితమవుతున్న అంశాలపై మీ అభిప్రాయాలను, సమాజ అభ్యుదయం కోసం ఉపకరించే మీ ఆలోచనలను మాతో క్లుప్తంగా పంచుకోండి. విషయ ప్రాధాన్యతను బట్టి వాటిని 'ప్రజావాణి'లో ప్రచురిస్తాం.

మీ భావాలను పంపవలసిన వాట్సాప్ నెంబర్: 98663 14741.

సం/-

## చంద్రశేఖర్‌రెడ్డీ!..

# నోరు అదుపులో పెట్టుకో!

- నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించం
- తాతల తరం నుండి మాది రాజకీయ కుటుంబం
- మీ రాజకీయ భిక్షతో మేమేమీ పదవుల్లోకి రాలేదు
- ఎమ్మెల్యే మేకపాటికి వింజమూరు జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి హెచ్చరిక



'చంద్రశేఖర్‌రెడ్డీ!.. నోరు అదుపులో పెట్టుకో!.. మా గురించి నోటికొచ్చినట్లు అసభ్యంగా మాట్లాడితే సహించం'... అంటూ వింజమూరు జడ్పీటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. సోమవారం వరికుంటపాడులో జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి తనపై అసభ్య పదజాలంతో లేనిపోని విమర్శలు గుప్పించడంపై గణపం తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'మాది తాతల తరం నుండి రాజకీయ కుటుంబం. మీ ద్వారా రాజకీయ బిక్ష పొందాననడం హాస్యాస్పదం' అంటూ ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి మాటలను ఖండించారు.

ఈనెల 26న వింజమూరులో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 'గణపం కుటుంబం అంటే ఏంటో జిల్లా వ్యాప్తంగా అందరికీ తెలుసు. తాతల తరం నుండి మాది రాజకీయ కుటుంబం. మీ రాజకీయ భిక్షతో మేమేమీ పదవుల్లోకి రాలేదు' అని గణపం స్పష్టం చేశారు. తమ గురించి, తమ కుటుంబం గురించి మీరు అనేక సందర్భాల్లో హేళనగా మాట్లాడడం బాధ కలిగించిందని, అయినా ఇంతవరకు సహనంతో ఓర్పుతో భరించామని, ఇక తమ సహనం నశించిందని ఆయన ఎమ్మెల్యేని ఉద్దేశించి అన్నారు.

### వార్డు సభ్యునిగా ఓడిపోయిన మీరు.. నాకు రాజకీయ భిక్ష పెట్టడం ఏంటీ?...

బ్రాహ్మణపల్లి గ్రామంలో వార్డు సభ్యునిగా పోటీ చేసి ఓడిపోయిన మీరు నాకు రాజకీయ బిక్షపెట్టడం ఏంటి అంటూ గణపం బాలకృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. మీరు ఓడిపోయిన నాటికే తాము వింజమూరు మేజర్ పంచాయతీకి సర్పంచ్‌గా ఉన్నామని, 1983 లోనే టిడిపి తరపున ఎమ్మెల్యేగా పోటీ చేశామని చెప్పారు. 1989లో మీరు పోటీ చేసి ఓడిపోయిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తన సతీమణి గణపం సుజాత రెండుసార్లు జడ్పీటిసిగా, సర్పంచ్‌గా వింజమూరు మండలంలో పదవులు అలంకరించారని, తన కుమారుడు గణపం కృష్ణకిరణ్‌రెడ్డి 2014లో వైకాపా తరపున ఎంపీపీగా విజయం సాధించారని ఆయన గుర్తుచేశారు. 2014లో జిల్లాలో ఆరుగురు ఎమ్మెల్యేలు గెలుపొందితే తమరు ఓడిపోయిన విషయం గుర్తుందా అని ఆయన విమర్శించారు. తాను సర్పంచ్‌గా, ఎంపీపీగా, జడ్పీటిసిగా వింజమూరు మండలంలో పదవీ బాధ్యతలు స్వీకరించి ఎలాంటి అవినీతికి తావు లేకుండా ప్రజల మన్ననలు పొందానన్నారు. అవినీతికి గణపం కుటుంబం ఆమడదూరమని తెలిపారు. మీ అవినీతిని సహించలేకే మీకు టికెట్ ఇవ్వవద్దని అధిష్టానానికి విన్నవించానని చెప్పారు. ఎనిమిది మండలాల్లోని నాయకులు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలన్న సంకల్పంతోనే వైసిపి పార్టీ వెంట నడిచి మీకు అత్యధిక మెజార్టీ సాధించి పెట్టామని, ఆ బలంతోనే మీరు ఈరోజు నోటికొచ్చినట్లు మాపై అసభ్యంగా మాట్లాడుతూ మీ అసలు రూపం బయటపెట్టుకుంటున్నారని ఆయన దుయ్యబట్టారు. ఎమ్మెల్యేగా ఉంటూ అలా మాట్లాడడం మంచిపద్ధతి కాదన్నారు. 2024లో పోటీచేస్తే నియోజకవర్గ ప్రజలు మీకు తగు గుణపాఠం చెప్తారన్నారు. ప్రజాదరణ పొందిన నాయకులను, కార్యకర్తలను విస్మరించి మండలానికి ఒక ఏజెంట్‌ను ఏర్పాటు చేసుకొని వారి ద్వారా అవినీతి పాలన చేస్తున్న మీకు చివరకు ఎనిమిదిమంది ఏజెంట్లు మిగులుతారన్నారు. ఏదేమైనా, మాటలు మాట్లాడేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడడం నేర్చుకోవాలని హితవు పలికారు. ఇంకోసారి అలా మాట్లాడితే మీ అవినీతి చిట్టా ఆధారాలతో సహా బయటపెడతానన్నారు. డబ్బు లేక రాజకీయాల్లో కొంచెం వెనకపడ్డామే తప్ప ఇక దేంట్లో మీకంటే తగ్గేదే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే పార్టీని మీరు భ్రష్టు పట్టించారని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తప్ప ఎవరు పోటీ చేసినా ఇక్కడ ఓటమి ఖాయమని అన్నారు. ఇకనైనా కార్యకర్తలను, నాయకులను విస్మరించకుండా ప్రజాపాలన చేయాలని, తద్వారా పార్టీకి, ముఖ్యమంత్రికి మంచిపేరు తేవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు యత్తపు భాస్కర్‌రెడ్డి, షేక్ ఖాజా, మహబూబ్ బాషా, రాజా తదితరులు పాల్గొన్నారు.

# ఏపిలో ఉన్నత సంస్థల ఏర్పాటు సత్వరం పూర్తిచేయండి

## కేంద్రంలోని అధికారులకు ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన



ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో భాగంగా రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న పలు ప్రభుత్వ ఉన్నత సంస్థల ఏర్పాటు త్వరితగతిన పూర్తికావాలని భారత ఉప రాష్ట్రపతి, మన నెల్లూరీయుడు ముప్పవరపు వెంకయ్య నాయుడు సంబంధిత కేంద్ర అధికారులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలతో పాటు దేశప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఆయా సంస్థల ఏర్పాటును పూర్తిచేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ఉప రాష్ట్రపతి ఎప్పటికప్పుడు సంబంధిత మంత్రిత్వ శాఖలతో సంప్రదిస్తూ మార్గనిర్దేశం చేస్తున్నారు.

భారత ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఇటీవల ఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి, వివిధ ప్రాజెక్టుల పనితీరును సమీక్షించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నెల్లూరు జిల్లాలో స్థలం మంజూరైన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర భవనం ఏర్పాటుకు నిధుల కేటాయింపు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చి అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్‌టి)కి చెందిన ప్రాంతీయ కేంద్ర రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్‌ఐఇ)–నెల్లూరు ఏర్పాటు విషయం గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. కేంద్ర విద్యాశాఖ కార్య దర్శి కె.సంజయ్‌మూర్తి ఆ వివరాలను ఉప రాష్ట్రపతికి నివేదించారు. ఆంధ్రప్రదేశ్‌లో సెంట్రల్ యూనివర్శిటీ (అనంతపురం), సెంట్రల్ ట్రైబల్ యూనివర్శిటీ (విజయనగరం), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–ఐఐటి (తిరుపతి), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్‌ఐటి)–తాడేపల్లిగూడెం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఏఎం) విశాఖపట్నం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐఐఎస్ఇఆర్) తిరుపతి, పెట్రోలియం యూనివర్శిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపి) విశాఖపట్నం, అగ్రికల్చరల్ యూనివర్శిటీ–ఆచార్య ఎన్‌జి రంగా అగ్రికల్చర్ యూనివర్శిటీ (ఏఎన్‌జిఆర్ఏయు) గుంటూరు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్–కర్నూలు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మరియు ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్) మంగళగిరిలలో ఏర్పాటు చేస్తున్న ఆయా సంస్థల పురోగతిని సంజయ్‌మూర్తి ఉప రాష్ట్రపతికి వివరించారు. ఆ సంస్థల పురోగతి విషయమై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్ కూడా సోమవారం ఉప రాష్ట్రపతితో చర్చించారు. అనంతరం పార్లమెంట్‌లోని తమ ఛాంబర్‌లో ఆర్యోగ, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ, హోంశాఖ సహాయమంత్రి నిత్యానందరాయ్‌తోను ఉప రాష్ట్రపతి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సంబంధిత మంత్రిత్వ శాఖల పరిధిలోని వివిధ సంస్థల ఏర్పాటు గురించి చర్చించారు.

### ఏపిఇఏపిసెట్‌లో సత్తాచాటిన...

## 'రత్నం' విద్యార్థులు



మాదన ధృతి

ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ఏపి ఇఏపి సెట్‌లో తిరుపతి డాక్టర్స్ మెడికల్ అకాడమి మరియు అమరావతి ఐఐటి అకాడమి, కృష్ణారెడ్డి శ్రీచైతన్య అకాడమి జూనియర్ కళాశాల మరియు రత్నం జూనియర్ కాలేజీ విద్యార్థులు సంచలన విజయం సాధించారు. బైపిసి విభాగంలో మాదన ధృతి రాష్ట్రస్థాయిలో 97వ ర్యాంకు సాధించగా, వి.మౌనిగణేష్ 166వ, కె.మాన్యలక్ష్మి 235వ, కె.ఇందు వర్షిత 360వ, డి.యశ్వంత్ 364వ, పి.శేషసాయివర్ధన్ 617వ, వై.ముకుంద చక్రధర్ 852వ ర్యాంకులు సాధించారని డాక్టర్స్ మెడికల్ అకాడమీ ఛైర్మెన్ బివి కృష్ణారెడ్డి తెలిపారు. రాష్ట్రస్థాయిలో 500లోపు 5 ర్యాంకులు, 1000లోపు 7, 2000లోపు 32, 3000లోపు 35 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారని, ఈ విజయాలకు కారణమైన అధ్యాపకులను, సిబ్బందిని, విద్యార్థుల తల్లితండ్రులను ఆయన అభినందించారు.

# 'తంగిరాల మహాభారతం'

### 14వ భాగం




దేవయాని తనకు ఇద్దరు నమ్మకద్రోహం చేశారని కోపంతో తండ్రి దగ్గరకు వెళ్ళినప్పుడు యయాతి మహారాజు కూడా పరుగు పరుగున శుక్రాచార్యుని దగ్గరకు భయం భయంగా వస్తాడు.

శుక్రాచార్యుడు కూతురి కష్టం చూసి యయాతి మహారాజు మీద మండిపడతాడు. అతడిని ముసలివాడై పోతావని శపిస్తాడు. కానీ ఇంతలో కొంచెం తగ్గి, యయాతి ప్రార్థించినప్పుడు, నీ కొడుకుల్లో ఎవరైనా వాళ్ళ యవ్వనం నీకిచ్చి నీ ముసలితనం తీసుకుంటే, కొన్ని రోజులు సుఖాలు అనుభవించి వారి యవ్వనం వారికిచ్చెయ్యవచ్చు. ఇంకా, ఎవరయితే అలా యవ్వనం ఇస్తారో, వాడే నీ తర్వాత రాజ్యానికి అర్హుడు అవుతాడు.

శాపం ఇవ్వగానే, యయాతికి ముసలితనం వచ్చేస్తుంది. ఇక భరించలేక 5గురు కొడుకులని అడుగుతాడు. యదు, తుర్వసు, ద్రువ్యుడు, అను కుమారులు అంగీకరించరు. వాళ్ళు అలా తన కోరికని తిరస్కరిస్తే కోపం వచ్చి వాళ్ళను శపిస్తాడు. చివరికి చిన్న కొడుకు పూరు కుమారుడు ఒప్పుకుంటాడు. అతనికి తన ముసలితనం ఇచ్చి అతని యవ్వనం తీసుకుని చాలా సంవత్సరాలు సుఖాలనుభవించి తిరిగి అతని యవ్వనాన్ని ఇచ్చి అతనికి యువరాజ పట్టాభిషేకం చేసి తాను అడవులకి వెళ్ళిపోయి తపస్సు చేసుకుంటూ తర్వాత చనిపోయి స్వర్గలోకానికి పయనమవుతాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.



# రెడ్‌క్రాస్ సేవలు అమోఘం



ప్రభుత్వ కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలందించడంలో దేశంలోనే జిల్లా రెడ్ క్రాస్ శాఖ అగ్రస్థానంలో ఉందని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్‌బాబు ప్రశంసించారు. ఇటీవల జిల్లా రెడ్ క్రాస్ సంస్థ కార్యాలయంలో రాజ్మల్ కేమ్ భండారి ఫౌండేషన్ (రాయచూర్), భగవాన్ మహావీర్ వికలాంగుల సహాయతా సమితి (జైపూర్) వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కృత్రిమ అవయవ స్క్రీనింగ్, కొలతల కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ మొదటి స్థానంలో నిలవడం సంతోషకరమన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షులు పి.చంద్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో 540 మంది దివ్యాంగులు కృతిమ కాలు, కృత్రిమ చేతులను ఏర్పాటు చేసుకునేందుకు తమ పేర్లను నమోదు చేసుకోవడం జరిగిందని, రానున్న రోజుల్లో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ప్రజలకు మరింతగా ఉత్తమ సేవలందించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు నాగరాజకుమారి, రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షులు దామిశెట్టి సురేశ్ నాయుడు, కో-కన్వీనర్ డా. రవికుమార్, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు. తొలుత రెడ్‌క్రాస్ సంస్థ వ్యవస్థాపకులు జాన్ హెన్రీ డ్యూనట్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు.

# 'శాకంబరి'గా .. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి



నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవాలయంలో ఈనెల 22న అమ్మ వారికి శాకంబరి అలంకారం నిర్వహిం చారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు అమ్మవారిని శోభాయ మానంగా అలంకరించి విశేషపూజలు చేశారు. 4900 కేజీల వివిధ రకాల కూర గాయలు, పండ్లతో నిర్వహించిన 'శాకం బరి' అలంకారం భక్తులకు కన్నుల పండుగ చేసింది. నుడా ఛైర్మెన్, ఆలయ పాలక మండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించు కున్నారు. పాదర్తి బాలాజీ, పైడా హేమంత్‌కుమార్, తన్నీరు కిషోర్ కుమార్, పబ్బిశెట్టి నందకిషోర్, పసుమర్తి కుమార్ ఉభయకర్తలుగా వ్యవహరించగా, ఆలయ కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివా సులు, సుంకు మనోహర్, బైసాని జ్యోతిప్రసాద్, చల వాది చరణ్‌కుమార్, కొణి జేటి వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.






# నెల్లూరు కబుర్లు

## కొండ దిగి రానున్న కోనేటిరాయుడు

### నెల్లూరులో ఆగస్టు 16 నుంచి శ్రీవారి వైభవోత్సవాలు




భక్తుల చెంతకే భగవంతుడు చేరుకునే అపూర్వమైన సన్నివేశాన్ని తిలకించే మహద్భాగ్యం ఆగస్టు 16న నెల్లూరీయులకు కలుగనుంది. కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని దివ్య వైభవోత్సవాలు ఆరోజు నుంచి ఆగస్టు 20వ తేది వరకు అయిదు రోజుల పాటు నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో న భూతో న భవిష్యతి అనే రీతిలో అత్యంత వైభవోపేతంగా జరుగనున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానాల వారి నేతృత్వంలో, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి టిటిడి ఉత్తరభారత దేశ దేవస్థానాల స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిల ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ అరుదైన అవ కాశాన్ని నెల్లూరు జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానాల జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వీరబ్రహ్మం కోరారు. నెల్లూరులో శ్రీవారి దివ్యోత్సవాలను నిర్వహించనున్న ఏసి సుబ్బారెడ్డి స్టేడియంను ఆయన ఇటీవల రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులతో పాటు ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సనాతన భారతీయ ధర్మ ప్రచారంలో భాగంగా ఇక్కడ శ్రీవారి నమూనా ఆలయాన్ని ఏర్పాటుచేసి వైభవోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు సుప్రభాతం నుంచి రాత్రి 8.30 గంటలకు జరిగే ఏకాంతసేవ వరకు తిరుమల ఆలయంలో జరిగినట్లే అన్నిరకాల సేవలను నిర్వహిస్తారని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వ హించడంతో పాటు, వైభవోత్సవాలకు పెద్దఎత్తున విచ్చేసే భక్తులకు అన్నప్రసాదాలు, ప్రాథమిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. భక్తులందరూ విచ్చేసి స్వామివారిని దర్శించుకుని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని ఆమె కోరారు.

## ఇరుకళల పరమేశ్వరి అమ్మవారికి..
## శ్రావణమాసం పూజలు



శ్రావణమాసం సందర్భంగా ఈనెల 29 నుంచి ఆగస్టు 26వ తేది వరకు సింహ పురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో విశిష్ట పూజలు, సేవలు చేపట్టనున్నారు. ప్రతిరోజు సాయంత్రం చందనాలంకారం, పూలంగిసేవ, రాత్రి 7.30 గంటలకు పల్లకిసేవలు, ప్రతి శుక్ర వారం సామూహిక కుంకుమార్చనపూజలు నిర్వహించనున్నారు. ఈనెల 29న అమ్మవారికి విశేషంగా గాజుల అలంకారం ఉంటుంది. ఆగస్టు 12న రాత్రి 7 గంటల నుంచి కన్నుల పండువగా పుష్పయాగం జరుగుతుంది. ఈ వేడుకల్లో భక్తులందరూ పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఛైర్మెన్ రావు శ్రీనివాసరావు కోరారు.






## శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో..
## శ్రావణమాస వేడుకలు

నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజే శ్వరిదేవి అమ్మవారి దేవాలయంలో శ్రావణమాసాన్ని పురస్క రించుకుని ఈనెల 29 నుంచి వేడుకలు జరుగనున్నా యని, ఈ మాసంలో 5 శుక్రవారాలు వచ్చాయి కనుక, 29న అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ఆగస్టు 5న సామూహిక వరలక్ష్మీవ్రతం, ఆగస్టు 12,19, 26 తేదీల్లో లక్ష కుంకుమార్చన పూజలు వైభవంగా జరుగుతాయని, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ నిర్వా హకులు కోరారు.

## ప్రతి ఇంటిపై...
# మువ్వన్నెల జెండా రెపరెపలాడాలి



దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా జరిగే 'ఆజాదీ కా అమృత మహోత్సవ్' కార్యక్రమాల్లో భాగంగా ఆగస్టు 13 నుంచి 15వ తేది వరకు 'హర్ ఘర్ తిరంగా' (ప్రతి ఇంటా మువ్వన్నెల జెండా) పేరుతో ఇంటింటా జాతీయపతాకాన్ని ఎగురవేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లాలోనూ ఆ మేరకు కార్యక్రమాల నిర్వహణకు జిల్లాయంత్రాంగం పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటోంది. స్వాతంత్య్రదినోత్సవాన్ని పురస్కరిం చుకుని ఆగస్టు 1 నుంచి 15వ తేది వరకు జిల్లాలో దేశభక్తిని పెంపొం దించే కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఇటీవల నిర్వహించిన సమావేశంలో సంబంధిత అధికారులకు సూచించారు. జాతీయజెండాకు ఎక్కడా అగౌరవం కలుగకుండా అపార మైన దేశభక్తి, శ్రద్ధలతో వలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికీ జాతీయజెండాలను అంద జేయాలని, జాతీయపతాకాలను ఎగురవేసే విధానాన్ని ప్రజలకు వివ రించాలని కలెక్టర్ ఆదేశించారు.

# విఎస్‌యులో రక్తదాన శిబిరం



నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యు)లో జాతీయసేవాపథకం, యూత్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఈనెల 25న రక్తదాన శిబిరం నిర్వహించారు. విఎస్‌యు ఉపకులపతి ఆచార్య జిఎం సుందర వల్లి ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరం ద్వారా 41 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు విఎస్‌యు రిజిస్ట్రార్ డా.పి.రామచంద్రారెడ్డి తెలియజేశారు. రక్తదానం మోటివేటర్ మధు, రవికుమార్, అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయానికి కొత్త ప్రాజెక్టు డైరెక్టర్

జిల్లా ప్రకృతి వ్యవసాయానికి కొత్త ప్రాజెక్టు డైరెక్టర్ నియమితు లయ్యారు. బొబ్బిలిలో సహాయ వ్యవసాయ సంచాలకుడిగా ఉన్న మాలకొండయ్యను ఈ శాఖకు ఇటీవలే డైరెక్టర్‌గా నియమించడంతో ఆయన ఇటీవల నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు. స్వచ్ఛమైన ఆహారధాన్యాలు పండించేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతో మంచిదని, దీనిపై రైతులకు అవగాహన కల్పిస్తామని ఆయన వివరించారు.

## కాంగ్రెస్ నేతలపై..
# ఇడి విచారణ దారుణం

### డిసిసి ఆధ్వర్యంలో ఆందోళన




అఖిలభారత కాంగ్రెస్‌పార్టీ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీపై ఇడి కేసులు దారుణమని, దేశంలో కాంగ్రెస్‌పార్టీని ఎదుర్కోలేక బిజెపి ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని, వెంటనే ఆ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ నెల్లూరులో ఇటీవల డిసిసి (జిల్లా కాంగ్రెస్ కమిటీ) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. నగరంలోని విజయ మహల్‌గేట్ వద్ద డిసిసి అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. కాంగ్రెస్‌పై బిజెపి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని, వెంటనే ఆ విచారణలను రద్దుచేయాలని చేవూరు డిమాండ్ చేశారు. నాయకులు వెంకట్రావుయాదవ్, శ్రీని వాసులురెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వేలూరు సుబ్బారావు, బాలసుధాకర్, రమేష్ నాయుడు, అల్లావుద్దీన్, వెంకటేశ్వర్లు, గణేష్‌బాబు, హుస్సేన్‌బాషా, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మేమంతా మీతోటే... వైసిపి ఎంపీల హామీ!



భాజపా ఉపరాష్ట్రపతి అభ్యర్థి జగదీప్ ధన్కర్‌కి మద్దతు తెలపడం కోసం వైసీపీ ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమంలో పలువురు వైకాపా ఎం.పిలు పాల్గొన్నారు. ఉభయ సభల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న వీరిలో... మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆదాల ప్రభాకరరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, బీద మస్తాన్‌రావు, వేణుంబాక విజయసాయిరెడ్డిలు మన నెల్లూరీయులు కావడం విశేషం.

# ఉభయ సభల్లో గళమెత్తిన మన నెల్లూరు ఎంపీలు









***లోక్‌సభ, రాజ్యసభల్లో మన నెల్లూరు ఎంపీలు గళమెత్తుతూ ప్రశ్నలు సంధిస్తున్నారు. సంబంధిత కేంద్రమంత్రుల నుంచి సమాధానాలు రాబడుతున్నారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీదా మస్తాన్‌రావు ఉభయసభల్లో వేస్తున్న ప్రశ్నల పరంపర జిల్లావాసులను ఆకట్టుకుంటోంది.***

### ఆదాల ప్రశ్నల పరంపర

కొత్తగా సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (సిఐఐఎల్)ను స్థాపించాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిందా అని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి లోక్‌సభలో ఇటీవల ప్రశ్నించారు. ఏపీలో కొత్త ప్రాంతీయ భాషా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉందా? అని కూడా అడిగారు. దీనికి కేంద్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ సుభాష్ సర్కార్ రాత పూర్వకంగా సమాధానమిస్తూ అటు వంటిదేమీ లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 1969లో దేశంలో పలుచోట్ల ప్రాంతీయ భాషల కేంద్రాలను ఏర్పాటు చేసిందని, అయితే సంప్రదాయ తెలుగు భాష ప్రచారం కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ స్టడీస్ ఫర్ క్లాసికల్ తెలుగు' కేంద్రాన్ని మైసూర్ నుంచి నెల్లూరుకు మార్చిందని తెలిపారు. సహకార బ్యాంకుల నిరర్ధక ఆస్తుల నివారణకు ఏం చర్యలు తీసుకున్నారు?..అని ఎంపి ఆదాల అడిగితే, కేంద్ర ఆర్థిక ఉపమంత్రి డాక్టర్ భగవత్ కరద రాత పూర్వకంగా సమాధానమిస్తూ సహకార బ్యాంకుల పాలనా నియంత్రణకు రిజర్వు బ్యాంక్‌కు అదనపు అధికారాలను కేటాయించామన్నారు.

### మిగులు భూములపై మాగుంట

దేశంలో నేషనల్ ల్యాండ్ మోనెటైజేషన్ కార్పొరేషన్ ఏర్పాటు గురించి, కేంద్ర సంస్థల మిగులు భూములు మరియు ఉపయోగం లేని భవనాల ఆస్తుల చలామణి/అమ్మకం ప్రక్రియ గురించి, 2021-22లో అన్ని మంత్రిత్వ శాఖలు వాటిపై సాధించిన లక్ష్యం మరియు 2022-23కు నిర్దేశించిన లక్ష్యం-అమ్మకాల గురించి ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ప్రశ్నలు సంధించారు. అందుకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయక మంత్రి డా. భగవత్ కరద సమాధానమిస్తూ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉండేవిధంగా రూ.5,000 కోట్ల ప్రారంభ వాటా ధనంతోను మరియు 150 కోట్ల చెల్లింపుల వాటా ధనంతో "నేషనల్ ల్యాండ్ మోనెటైజేషన్ కార్పొరేషన్" ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపిందని, ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రభుత్వ సంస్థల మిగులు భూముల మరియు ఉపయోగంలేని భవనాల తదితర ఆస్తుల అమ్మకం, చలామణి ప్రక్రియ గురించి ఆ కార్పొరేషన్ పర్యవేక్షిస్తుందని, దీనివలన ప్రైవేటు పెట్టుబడులు తగ్గడంతోపాటు క్రొత్త ఆర్థిక కార్యకలాపాలు చేపట్టవచ్చని తెలిపారు.

### కేంద్రానికి వేమిరెడ్డి ప్రశ్నలు

మారిటైమ్ ఇండియా విజన్ - 2030ను ప్రధాన మంత్రి ఇటీవల ఆవిష్కరించిన విషయం వాస్తవమేనా, ఆ విజన్ యొక్క ముఖ్య లక్షణాలు, మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను ప్రతిపాదించలేదనే విషయం వాస్తవమేనా, దానికిగల కారణాలు తెలుపమని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి లిఖితపూర్వకంగా ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి సర్బానందా సోనోవాల్ భారత ప్రధాన మంత్రి 2021న మారిటైమ్ ఇండియా విజన్-2030 యొక్క ఇ-బుక్‌ను వర్చువల్ మోడ్ ద్వారా విడుదల చేశారని, మారిటైమ్ భారతీయ సముద్ర రంగం యొక్క అన్ని కోణాలను కవర్‌చేసే థీమ్‌లలో 150కి పైగా కార్యక్రమాలను గుర్తిస్తుందని తెలిపారు. మారిటైమ్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను ప్రతిపాదించ లేదనే విషయం అవాస్తవమని, మారిటైమ్ సముద్ర రంగం అవసరాలకు సులభంగా అనుసంధించడానికి దీర్ఘకాలిక ఫైనాన్స్ రూపొందించాలని భావిస్తోందని తెలిపారు.

### సాగరమాల వివరాలు తెలపాలన్న మస్తాన్‌రావు

ఈనెల 26న రాజ్యసభలో డా. బీద మస్తాన్‌రావు ఆంధ్ర ప్రదేశ్‌లో సాగరమాల కింద మంజూరైన ప్రాజెక్టులు ఎన్ని?.. ప్రాజెక్ట్ అమలు యొక్క ప్రస్తుత స్థితి, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాజెక్టుల కోసం కేటాయించిన మరియు వినియోగించిన నిధుల గురించి ప్రశ్నించారు. అందుకు ఓడరేవు, షిప్పింగ్, జలమార్గాల కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ సమాధానం ఇస్తూ ఆంధ్రప్రదేశ్‌లో సాగరమాల కార్యక్రమం ద్వారా 13 ప్రాజెక్ట్‌లలో 5 ప్రాజెక్టులు 754 కోట్లతో పూర్తయ్యాయని, మరో 3 ప్రాజెక్టులు 316 కోట్లతో అమలులో ఉన్నాయని, 5 ప్రాజెక్టులు 463 కోట్లతో పురోగతిలో ఉన్నాయని, నెల్లూరుజిల్లాలోని జువ్వల దిన్నెలోని ఫిషింగ్‌హార్బర్ కోసం 288 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభమైన ప్రాజెక్టుకు ప్రస్తుతానికి 36.10కోట్లు మంజూరు చేయడం జరిగిందని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు.

## ఉద్యోగాల భర్తీలో

# చరిత్ర సృష్టించిన సీఎం జగన్

### --- కొనియాడిన మంత్రి కాకాణి ---



దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత ఎంతోమంది ముఖ్యమంత్రులు పనిచేశారని, అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించారని, అయితే దేశంలో ఎక్కడా లేని విధంగా, వ్యవస్థల్లో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈనెల 24న నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో సచివాలయ ఉద్యోగులకు ప్రొబేషన్ డిక్లేర్ చేసిన సందర్భంగా గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపే ఆత్మీయ అభినందన సభ (థాంక్యూ సీఎం సార్) కార్యక్రమాన్ని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర మేయర్ స్రవంతి తదితరులతో కలిసి మంత్రి కాకాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే నోటిఫికేషన్‌తో లక్షా34వేల ఉద్యోగాలను భర్తీచేసి చరిత్ర సృష్టించిన ఘనత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలందించాలి

### - రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి


సచివాలయ వ్యవస్థలో పనిచేసే వారిలో ఎక్కువమంది ఉన్నత విద్యావంతులు ఉండడం ఈ సచివాలయ వ్యవస్థ గొప్పతనమని, అందువల్లనే ప్రభుత్వం అందించే ఆదేశాలు చక్కగా పాటిస్తూ, అనేక సంక్షేమ పథకాలను ఎక్కడా లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా ప్రజలకు చేరవేస్తున్నారని, ఇదే స్ఫూర్తితో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. తొలుత చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతి, ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, డెప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, గ్రామ, వార్డు సచివాలయాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ హరీష్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ సిహెచ్ వెంకటేష్, జిల్లా అధ్యక్షులు సతీష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సందీప్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# నుడా పరిధిలో త్వరలో మాస్టర్‌ప్లాన్

### - చైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్



నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా) పరిధిలో మాస్టర్‌ప్లాన్ అమలు కోసం కృషిచేస్తున్నామని నుడా చైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్ చెప్పారు. ఈనెల 26న ఆయన నెల్లూరులోని నుడా కార్యాలయంలో నుడా ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరులో ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలున్నాయని చెప్పారు. నుడా పరిధిలో 118 అక్రమ లేఅవుట్‌లు ఉన్నట్లు గుర్తించామని, దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామని, ప్రభుత్వం నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ లేఅవుట్‌లను నియంత్రించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని కూడా నియమిస్తామని, వారం రోజుల్లో అందుకు సంబంధించి విధి విధానాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో చైర్మెన్ ముక్కాలతో పాటు కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, నుడా వైస్‌చైర్మెన్ నందన్ పాల్గొన్నారు.

## ఉత్తరక్రియలు (తేదీ మార్పు)

మాకు స్ఫూర్తిప్రదాత, మార్గదర్శకులు, మా ఇంటి దైవం, మాకు పెద్దదిక్కు

**దామవరపు రాధాకృష్ణారెడ్డి గారు,** పొట్టెంపాడు, నెల్లూరుజిల్లా.

(రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఇంజనీర్, ఇరిగేషన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. ప్రతిష్టాత్మక నేషనల్ సిటిజన్స్ అవార్డు గ్రహీత)

జులై 19,2022, మంగళవారం ఉదయం 10 గంటలకు హైదరాబాదులో పరమపదించారు.

ఆ మహనీయుని పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...

- కుటుంబసభ్యులు

ఉత్తరక్రియలు : వారి పెద్దకర్మ తేది. 30-07-2022, శనివారం ఉ॥ 11.00 గంటలకు, ఫ్లాట్ నెం. 133/ఏ, రోడ్డు నెం. 15, జూబ్లీహిల్స్, హైదరాబాదులోని వారి స్వగృహము నందు జరుగును. తేదీ మార్పును బంధుమిత్రులు గమనించగలరు.



### కోటీ 18 లక్షలతో..

# పోలేరమ్మతల్లికి స్వర్ణాభరణాలు

## సెప్టెంబర్‌లో అమ్మవారి జాతర - ఎమ్మెల్యే ఆనం

వెంకటగిరి గ్రామశక్తి శ్రీ పోలేరమ్మ అమ్మవారికి భక్తులు, స్థానిక ప్రజల సహకారంతో, ఆలయ ధర్మకర్తల మండలి సారధ్యంలో సుమారు కోటీ 18 లక్షల రూపాయల వ్యయంతో స్వర్ణాభరణాలు సమకూర్చేందుకు కృషిచేస్తున్నామని వెంకటగిరి ఎమ్మెల్యే, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అమ్మవారికి నుదుటి విభూతి పట్టె కోసం లక్షాతొంభై వేల రూపాయలను బహూకరించిన వెంకటగిరి పోలీస్ సర్కిల్ అధికారులు, మరియు వారి కుటుంబసభ్యులను, మరియు అమ్మవారి స్వర్ణాభరణాల కోసం కానుకలను సమర్పించిన పలువురు భక్తులను ఈనెల 24న ఆయన అభినందించారు. వచ్చే సెప్టెంబర్‌లో అమ్మవారికి దేదీప్యమానంగా జాతర నిర్వహించేలా ఇప్పటి నుండే ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

### 11 కుటుంబాలకు.. 18.28 లక్షల సిఎం సహాయనిధి

వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని తిరుపతి జిల్లాకు చెందిన వెంకటగిరి, బాలాయపల్లి మరియు డక్కిలి మండలాలకు సంబంధించిన 11 కుటుంబాలకు 18.28 లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ నిధుల చెక్కులను ఇటీవల ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి వెంకటగిరిలోని 'స్పందన' కార్యాలయం వద్ద సంబంధిత లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో అర్హత లేనప్పటికీ వ్యాధుల పాలైన పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సిఎం సహాయనిధి ద్వారా వారికి బాసటగా ఆర్థిక సాయం మంజూరు చేశారన్నారు.

### గూడూరు 'ఆదిశంకర'లో

# విశ్వశాంతి కోసం మహాయాగం

## యాగక్రతువును ప్రారంభించిన వేమిరెడ్డి దంపతులు



అటు కోట్లాదిగా ప్రజలను వణికిస్తున్న కరోనా మహమ్మారి. ఇటు ప్రకృతి విపత్తులు. మరోవైపు ఉగ్రవాదం. ఇంకోవైపు పలుదేశాల్లో యుద్ధ వాతావరణాలు... ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న నేపథ్యంలో 'విశ్వశాంతి'ని ఆకాంక్షిస్తూ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని గూడూరులో అత్యంత శక్తివంతమైన 'సర్వ అద్భుత శాంతి మహాయాగం' ఈ నెల24న మొదలైంది. మహర్షి వేదిక్ యూనివర్శిటీ (హాలండ్) అడ్వయిజర్ పి.చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో, ఆదిశంకర విద్యాసంస్థల ఛైర్మన్ వంకి పెంచలయ్య దంపతులు, ప్రముఖ పారిశ్రామికవేత్త, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి-ప్రశాంతిరెడ్డి దంపతులు శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఈ యాగాన్ని ప్రారంభించారు. ఆషాడ మాసం బహుళ ఏకాదశి శుభముహూర్తంలో ఈ యాగానికి ఆదివారం అంకురార్పణ జరిగింది. దేవదేవుని నామస్మరణలతో ప్రపంచ శాంతిని కోరుతూ ఋత్విక్కులు భక్తిప్రపత్తులతో యాగాన్ని చేపట్టారు. ఏడు రోజుల పాటు.. సప్తాహ్నికంగా, వైఖానసాగమోక్తంగా ఈనెల 30వ తేది వరకు ఎంతో నిష్ఠతో నేత్రపర్వంగా ఈ యాగం నిర్వహిస్తున్నారు.

### 29న శ్రీనివాస కల్యాణం

సర్వ అద్భుత శాంతి మహాయాగంలో భాగంగా ఈనెల 29న శ్రీ శ్రీనివాస కల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించనున్నారు. ఏడురోజులు జరిగే ఈ మహాయాగంతో పాటు శ్రీ శ్రీనివాస కల్యాణ వైభవాన్ని కూడా దర్శించుకుని ఆ తిరుమలేశుని కరుణా కటాక్షాలకు పాత్రులు కావలసిందిగా నిర్వాహకులు కోరుతున్నారు.

### సిబిఎస్‌ఇ-టెన్త్ ఫలితాల్లో..

# శ్రీసిటీ-చిన్మయా విద్యాలయ విజయకేతనం

## వరుసగా ఆరవసారి వందశాతం ఉత్తీర్ణత

ఇటీవల వెలువడిన సిబిఎస్ఇ పదవ తరగతి ఫలితాల్లో శ్రీసిటీ చిన్మయా విద్యాలయ సిబిఎస్ఇ పాఠశాల నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ పాఠశాల నుంచి 33 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే, అందరూ ఉత్తీర్ణత సాధించారని చిన్మయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.భువనేశ్వరి తెలిపారు. వీరిలో 27 మంది డిస్టింక్షన్‌లో పాస్ కాగా, నలుగురు ఫస్ట్ క్లాస్, ఇద్దరు సెకండ్ క్లాస్ సాధించారన్నారు. వీరిలో వంశిక కుమార్ 97.2 శాతం (486/500), లక్ష్మీప్రియ మల్లిక్ 96.4 శాతం, (482/500), సాయి జ్యోతిర్మయి 94.6 శాతం (473/500) అత్యుత్తమ మార్కులు సాధించి స్కూల్ టాపర్లుగా నిలిచారని ఆమె పేర్కొన్నారు. కాగా పాఠశాలకు సంబంధించి పదవ తరగతి పరీక్షలకు ఇది ఆరవ బ్యాచ్ కాగా, వరుసగా ఆరేళ్ళు వందశాతం ఫలితాలు సాధించడం విశేషం. మంచి ఫలితాలు సాధించినందుకు విద్యార్థులు, ప్రిన్సిపాల్, టీచర్లకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

### 10వ తరగతి సిబిఎస్ఇ ఫలితాల్లో

# లిటిల్ ఏంజెల్స్ విజయ దుందుభి



ఇటీవల విడుదలైన సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాల్లో 'లిటిల్ ఏంజెల్స్' విద్యార్థులు మరో సారి తమ విజయపరంపరని కొనసాగించారు. 99 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, అందరూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. వి.నారాయణ నయని 600 మార్కులకు 585 సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఎస్‌కె మోహాసీన, కె.రుచితలు 580 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.నమఃశివాయకు, ఉపాధ్యాయ బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల కరస్పాండెంట్ బి.శ్రీకాంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు.

# అబ్దుల్ కలాం 7వ వర్ధంతి



భారత మాజీ రాష్ట్రపతివర్యులు డా. ఏ.పి.జె.అబ్దుల్‌కలాం 7వ వర్ధంతి పురస్కరించుకుని గూడూరులోని డా. ఏ.పి.జె.అబ్దుల్‌కలాం చారిటబుల్ ట్రస్ట్ వారు బాలసదన్‌లోని విద్యార్థినీవిద్యార్థులకు ట్రస్ట్ ఫౌండర్ సయ్యద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో దుప్పట్లు, ప్లేట్లు, మగ్గులు, ఊరగాయపచ్చళ్ళు, స్వీట్, హాట్, మహిళా ఉద్యోగినులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి చేవూరి విజయమోహన్‌రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా ఆర్‌డిఓ మురళీకృష్ణ, డిఎస్పీ ఎం.రాజగోపాలరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, రూరల్ సి.ఐ పి.శ్రీనివాసులరెడ్డి, ఆర్‌పిఎఫ్ సిహెచ్ లక్ష్మీనారాయణ, అరవ పార్వతయ్య, బండి శ్యామ్‌సుందర్, వై.శ్రీనివాసులు, గోకుల కృష్ణ, సదన్ సూపరింటెండెంట్ పి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

# నిరంతరాయంగా... రోటరీ సేవలు





గూడూరు రోటరీ క్లబ్ సభ్యులు నిరంతరం ఏదో ఒక సేవా కార్యక్రమం చేస్తూనే ఉన్నారు. దాంట్లో భాగంగానే గూడూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ రొటేరియన్ బి.వి. శ్రీధర్‌రెడ్డి దాతృత్వంతో గూడూరు ఏరియా ఆసుపత్రిలో హాస్పిటల్ సూపరింటెండెంట్ రామకృష్ణకి, చిన్నపిల్లలకు ఉపయోగపడే 50 బ్లాంకెట్స్ అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రోటరీ ప్రెసిడెంట్ కిరణ్‌చక్రవర్తి, సెక్రటరీ రవికుమార్, దశరథరామిరెడ్డి, మయూరి శ్యాంయాదవ్, రాంప్రసాద్, పి.వి.కృష్ణయ్య పాల్గొన్నారు. అలాగే, ఈ నెల 27వ తేదీనే గూడూరు రోటరీక్లబ్ వెస్ట్ 'రోటరీ దివ్యాంగుల భరోసా' అనే నూతన కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా దివ్యాంగులకు ఫలసరుకులు అందజేశారు. రోటరీ వెస్ట్ అధ్యక్షులు ధనంజయరెడ్డి, కార్యదర్శి విజయ్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ సి.జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సాయినాథ్, రొటేరియన్ ఎన్.ఎస్.రెడ్డి, వాసుగౌడ్ పాల్గొన్నారు.

# మొక్కలు నాటిన ఆర్.పి.ఎఫ్ పోలీసులు



కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆజాది కా అమృత్ మహోత్సవ్ వేడుకలలో భాగంగా ఈ నెల 23వ తేదీ రైల్వే రక్షక దళం పోలీసులు స్టేషన్ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలలో స్వచ్ఛసేవ చేసి చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం రైల్వే ప్రయాణికులకు మినీ చలివేంద్రం ఏర్పాటు చేసి మంచి నీటిని అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఐపీఎఫ్ వైఎల్.నారాయణ, ఎస్.ఐ ఎస్.లీలకృష్ణ, ఏ.ఎస్.ఐ నాగరాజారావు, ఎస్పీఎస్ నాయక్, హెడ్‌కానిస్టేబుల్ కె.ఎం.కె.కలాం, కానిస్టేబుల్ పి.హెచ్ నారాయణ, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

### పిఎస్ఆర్ ట్రస్ట్ సహకారంతో

# దివ్యాంగులకు బస్‌పాస్‌లు



మాట్లాడుతున్న ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

దివ్యాంగులు సుదూర ప్రాంతాలకు ప్రయాణించే సమయంలో ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో కల్పించే రాయితీని సద్వినియోగం చేసుకోవాలని డిఎం వెంకటేశ్వరరావు తెలిపారు. గూడూరు పట్టణంలోని ఆర్టీసీ ప్రాంగణంలో పిఎస్ఆర్ ట్రస్టు సహకారంతో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్‌లను ఇటీవల అందజేశారు. ఈ సందర్భంగా రెడ్ సంస్థ ప్రతినిధి సుధీర్ మాట్లాడుతూ దివ్యాంగులు పాస్‌లు పొందేందుకు రూ.100 చెల్లించాల్సి ఉండగా, పిఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ట్రస్టు అధినేత పొణకా శివకుమార్‌రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్పర్సన్ పొణకా దేవసేనమ్మల సహకారంతో ఎంతమందికైనా చెల్లించేలా సహకారం అందించారని కొనియాడారు. డిపో మేనేజర్ ఎం.వెంకటేశ్వర్లు, శ్రీధర్, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

# విద్యుత్ మీటర్లతో రైతులకు భారం ఉండదు

## ప్రతిపక్షాల దుష్ప్రచారం నమ్మకండి - మంత్రి కాకాణి



విద్యుత్ మీటర్లతో రైతులకు ఎలాంటి భారం ఉండదని, విద్యుత్ లోడ్ తెలుసుకునేందుకే వాటిని ఏర్పాటు చేస్తామే తప్ప రైతులకు వాటివల్ల ఇబ్బందులేమీ ఉండవని రాష్ట్ర వ్యవసాయమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ లోడ్‌ను బట్టి కెపాసిటీలు పెంచేందుకు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా చూసేందుకు, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు మీటర్లు బిగించడం జరుగుతుందే తప్ప రైతులపై భారం వేసేందుకు కాదని ఆయన స్పష్టం చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందజేయాలనే లక్ష్యంతో వ్యవసాయ మీటర్లు ఏర్పాటుచేస్తారని, మీటర్లు ఏర్పాటుచేసినప్పుడే ఆయా ప్రాంతాల్లో ఎంతమందికి ఉచిత విద్యుత్ ఇవ్వాల్సి ఉంది, ఎన్ని యూనిట్లు ఇవ్వాలి, అందుకు ఎంత సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయాలనే విషయాలు తెలుస్తాయని, అయితే ఈ విషయంలో ప్రతిపక్ష నాయకులు లేనిపోని విమర్శలు చేయడం, రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. కొంతమంది రైతుద్రోహులు కావాలనే రైతులను పక్కదారి పట్టిస్తున్నారని, అలాంటివారి మాటలు నమ్మవద్దని ఆయన రైతులకు విజ్ఞప్తిచేశారు. ఇటీవల మనుబోలులో టిడిపి ఆధ్వర్యంలో జరిగిన 'రైతుపోరు' సభ నీరుగారిపోయిందని విమర్శించారు. తమది రైతు పక్షపాత ప్రభుత్వమని, రైతు సంక్షేమమే వైకాపా ప్రభుత్వ ధ్యేయమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలోని రైతులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నారని చెప్పారు.

**'గడప గడప'కు అపూర్వ స్పందన**

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో చేపడుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రతి ఇంటా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఇటీవల తోటపల్లిగూడూరు మండలం మల్లికార్జునపురం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మల్లికార్జునపురం ఎస్సీ కాలనీ, కోనేటిమిట్ట, సాలిపేట ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాలను వివరించి, అర్హత ఉండి ఇంకా ఏమైనా సంక్షేమ పథకాలు అందాలా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గడిచిన మూడేళ్లలో తమ ప్రభుత్వం సుమారు లక్షా 50 వేల కోట్ల రూపాయల నగదును ఎటువంటి అవినీతికి తావులేకుండా, పారదర్శకంగా అనేక సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందజేసిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో హైమావతి, తహశీల్దార్ శ్యామలమ్మ, ఎంపీపీ స్వర్ణలత, సర్పంచ్ కల్లూరి ఇంద్రసేన, మండల వ్యవసాయాధికారి గీతాకుమారి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సైనికోద్యోగులకు అన్నివిధాలా సహకారం

## - ఆర్డీఓ వెంకటనారాయణమ్మ

జిల్లాలోని మాజీ సైనికోద్యోగులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి వెంకటనారాయణమ్మ పేర్కొన్నారు. ఈనెల 23న నెల్లూరు కలెక్టరేట్‌లో జిల్లా సైనిక బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సైనికోద్యోగులతో డిఆర్‌ఓ చర్చించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ శాఖలు పబ్లిక్ అండర్ టేకింగ్ కార్యాలయాల్లో నియమ నిబంధనల మేరకు 2 శాతం ఉద్యోగాలను మాజీ సైనికులకు ప్రాధాన్యతనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారని, ఇంకా అనేక సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని వారి అభ్యర్థనలన్నిటినీ సానుకూలంగా పరిశీలించి తగు చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సైనిక అధికారి పివిఎస్ రమేష్, సైనిక బోర్డు ఉపాధ్యక్షులు విశ్రాంత వింగ్ కమాండర్ ఆర్.వి.ఎస్ రెడ్డి, జిల్లా ఉపాధి కల్పనా అధికారి సురేష్‌కుమార్, బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, మున్సిపల్ ఉప కమిషనర్ చెన్నుడు, డిటిసి ఏవో లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 'రైతుపోరు'.. సక్సెస్

## అంతం కాదిది ఆరంభం



మాజీమంత్రి సోమిరెడ్డి

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇటీవల మనుబోలులో జరిగిన 'రైతుపోరు' సభ బ్రహ్మాండంగా జరిగిందని, రాష్ట్రవ్యాప్తంగా రైతులు పెద్దఎత్తున తరలిరావడంతో వ్యవసాయమంత్రి కాకాణికి నిద్రపట్టడం లేదని, రైతుపోరు సభ విజయవంతం కావడం చూసి ఓర్వలేక తమపై విమర్శలు చేస్తున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు.

నెల్లూరు, తిరుపతి, ఒంగోలు, చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించిన రైతులు భారీగా రైతుపోరుకు వచ్చారంటూ ఆయన సంతోషం వ్యక్తం చేశారు. రైతులకు జగన్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయలపై తెలుగుదేశం పార్టీ రైతుల పక్షాన నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని, అంతం కాదిది ఆరంభం అని ఆయన అన్నారు. మూడేళ్ళ జగన్ పాలనలో రైతులు నిండా మునిగిపోయారని పేర్కొంటూ, కాకాణికి దమ్ముంటే రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి టిడిపి, వైసీపిలు ఎంతెంత వెచ్చించాయో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు.

### ద్రౌపది ముర్ము విజయం..

# గిరిజనుల్లో ఆనందోత్సాహం



భారత రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము విజయం సాధించడంతో జిల్లాలోని గిరిజనుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. బుచ్చిరెడ్డిపాళెంలోని మంగళపాళెం గిరిజనకాలనీలో సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో ఇటీవల ద్రౌపది ముర్ము విజయోత్సవ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ద్రౌపది ముర్ము గిరిజన మహిళ కావడం, దేశంలో అత్యున్నత మైన రాష్ట్రపతి పదవిని అధిష్టించడం తమకెంతో ఆనందం కలిగిస్తోందని గిరిజనులు తెలిపారు. ద్రౌపది ముర్ము చిత్రపటాలను చేతపట్టి జేజేలు పలికారు. సమరసతా వేదిక అధ్యక్షులు నేలనూతల శ్రీధర్ ఆధ్వర్యంలో అందరికీ మిఠాయిల పంపిణీ జరిగింది.

# 50 శాతం సబ్సిడీతో కంది విత్తనాలు

50 శాతం సబ్సిడీతో రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు కంది విత్తనాలు అందజేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాపూరు మండల వ్యవసాయ అధికారి సోమసుందర్ తెలిపారు.

## టూకీగా...



### సచివాలయ ఉద్యోగులకు డ్రెస్‌కోడ్ తప్పనిసరి

సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా డ్రెస్‌కోడ్ పాటించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ స్పష్టం చేశారు. ఇటీవల ఆయన ముత్తుకూరులో సచివాలయాన్ని సందర్శించారు. అక్కడి ఉద్యోగులు డ్రెస్‌కోడ్ పాటించకపోవడం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### సిద్ధనకొండూరులో గుట్కా ప్యాకెట్ల పట్టివేత

కలిగిరి మండలంలోని సిద్ధనకొండూరు గ్రామంలో 70వేల రూపాయల విలువజేసే నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. 236 గుట్కా ప్యాకెట్లతో పాటు, వాటిని అక్రమంగా రవాణాచేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి మోటార్‌సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సూర్యప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### విడవలూరు ప్రభుత్వ డిగ్రీకాలేజీల్లో అడ్మిషన్లు

జిల్లాలోని విడవలూరు ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మొదటి సంవత్సరం డిగ్రీకోర్సుల ప్రవేశానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఈనెల 31వ తేదీలోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని, వివరాలకు 9441443004 ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ సుజాత పేర్కొన్నారు.

### కోవూరు డాబాలపై సెబ్ అధికారుల తనిఖీలు

కోవూరు జాతీయ రహదారిలో ఉన్న దాబాలను ఇటీవల కోవూరు సెబ్ ఎస్‌ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. దాబాల్లో మద్యం నిల్వ ఉన్నా, ఎవరైనా అక్రమ మద్యం తాగుతున్నా కేసులు నమోదుచేస్తామని దాబాలవారిని హెచ్చరించారు.

### వీరజవాన్ల త్యాగాలను విస్మరించకూడదు

దేశం కోసం ఎందరో వీరజవాన్లు తమ ప్రాణాలను సైతం త్యాగం చేశారని, ఆ వీరుల త్యాగాలను విస్మరించకూడదని నెల్లూరు పినాకిని లయన్స్ క్లబ్ నిర్వాహకులు కిరణ్‌కుమార్, రామకృష్ణ, సునీల్, లీలాధర్‌రెడ్డి, విక్రమ్ తదితరులు పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఈనెల 26న నెల్లూరులోని సంతపేటలో జరిగిన కార్యక్రమంలో వీరజవాన్లకు వారు నివాళులర్పించారు.

### పింఛనుదార్ల బకాయిలను చెల్లించాలి

విశ్రాంత ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీనే పింఛన్ ఇవ్వాలని, పింఛనుదార్లకు చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఇటీవల కోవూరులో జరిగిన విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశంలో నాయకులు కోరారు. ఆ సంఘం కార్యదర్శి జయరామయ్య, ఉపాధ్యక్షుడు గిరికుమార్, కోశాధికారి వెంకయ్య పాల్గొన్నారు.




కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

## శ్రద్ధాంజలి

మా ఇంటి ఆశాజ్యోతి, నిరంతరం మా హృదయాంతరాల్లో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.
01-08-2022 సోమవారం ఆ మహనీయుని 45వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారులు
మాగుంట సుధాకర్‌రెడ్డి
మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎం.పి

మనుమడు
మాగుంట విజయ్‌రెడ్డి

## శ్రీ ధర్మరాజస్వామి దేవాలయంలో..

# కన్నులపండువగా బ్రహ్మోత్సవాలు



నెల్లూరు మూలాపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజస్వామి దేవస్థానంలో మహాభారతంలోని ఘట్టాలను తలపిస్తూ బ్రహ్మోత్సవాలు ఎంతో వేడుకగా జరుగుతున్నాయి. ఈనెల 13 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎంతో పురాతనమైన ఈ దేవాలయంలో శ్రీకృష్ణుడు, ధర్మరాజు, ద్రౌపదిదేవి అమ్మవారు కొలువై ఉంటారు. అగ్నికుల క్షత్రియులకు కులదేవతగా ద్రౌపదిదేవి అమ్మవారు ఎంతోకాలంగా ఇక్కడ పూజలందుకుంటున్నారు. మూడేళ్లకోసారి బ్రహ్మోత్సవాలు ఇక్కడ బ్రహ్మాండంగా జరుగుతాయి. మహాభారతంలోని ఘట్టాలను జ్ఞాపకం చేస్తూ... ఎంతో వైభవోపేతంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ఒక్కో అలంకారంతో ఆలయ అర్చకులు స్వామివార్లకు పూజలు చేస్తున్నారు. ఈనెల 27న ఉత్తర గోగ్రహణ అలంకారాన్ని ఆలయ అర్చకులు కన్నులపండువగా నిర్వహించారు. ఆగస్టు 2వ తేది వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొంటున్నారు.

# హోరాహోరీగా..మహిళల క్రికెట్ పోటీలు

## పోటాపోటీగా..5 జిల్లాల క్రీడాకారిణులు

సౌత్‌జోన్ మహిళా క్రికెట్ పోటీలు నెల్లూరులో ఈనెల 27 నుంచి ప్రారంభమయ్యాయి. హోరాహోరీగా జరుగుతున్న ఈ పోటీల్లో నెల్లూరుజిల్లా క్రీడాకారిణులతో పాటు చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన క్రీడాకారిణులు పాల్గొంటున్నారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు సివిఎస్ మూర్తి ఈ పోటీలను ప్రారంభించారు. ప్రతిష్టాత్మకమైన ఈ పోటీలను ఆంధ్ర క్రికెట్ సంఘం నెల్లూరుకు కేటాయించిందని ఆయన తెలిపారు. ఆరు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి కె.మునిగిరీష్, కోశాధికారి అబూబకర్, మాజీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సిఐఏ నిర్వాహకులు వంశీధర్‌రెడ్డితో పాటు మహిళా కోచ్‌లు పాల్గొన్నారు.

# ఆగస్టు 1 నుంచి..రేషన్ సరుకులు పంపిణీ

ఆగస్టు 1 నుంచి ఇళ్ళవద్దకే రేషన్ పంపిణీ చేస్తామని డిఎస్‌ఓ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాలోని 7,18,665 మంది తెల్లరేషన్‌కార్డుదారులకు బియ్యం కిలో రూపాయి వంతున మనిషికి 5 కిలోల బియ్యం అందజేస్తామన్నారు. కార్డుకు కిలో కందిపప్పు 67 రూపాయల వంతున, అర కిలో చక్కెర 17 రూపాయలకు అందజేస్తామని తెలిపారు. అదేవిధంగా ఏఏవై కార్డుదారులకు కిలో రూపాయి వంతున 35 కిలోల బియ్యం, కిలో కందిపప్పు రూ. 67 వంతున, కిలో చక్కెర రూ.34 వంతున అందజేస్తారని తెలిపారు. అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల బియ్యం ఉచితంగా పంపిణీచేస్తామన్నారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మొబైల్ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

## కాలధర్మం

# మంచికంటి కృష్ణయ్య



వెంకటరమణ కృష్ణయ్యగా గృహోపకరణాల రంగంలో ప్రఖ్యాతిగాంచిన మంచికంటి రాధాకృష్ణయ్య, తన 77వ ఏట జులై 24వతేదీ ఆదివారం ఉదయం నెల్లూరులో తుదిశ్వాస విడిచారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి తాలూకా బశినేనిపల్లి కృష్ణయ్య సొంత గ్రామం. 1975లో తన 30వ ఏట నెల్లూరు నగరం చిన్నబజారులో వెంకటరమణ స్టీల్‌హౌస్ పేరుతో వ్యాపారాన్ని ప్రారంభించి అనతికాలంలోనే విశేష గుర్తింపు సాధించాడు కృష్ణయ్య. చిన్నబజారులో తన వ్యాపారాన్ని కొనసాగిస్తూనే 1997లో ట్రంకురోడ్డులోని ఏ.టి. అగ్రహారంలో శ్రీ వెంకటరమణ ఆర్కేడ్ పేరుతో ఆధునాతన గృహోపకారణాల సముదాయాన్ని మహిళల కోసం అందుబాటులోకి తెచ్చారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక హంగులతో షోరూమ్‌ని తీర్చిదిద్ది నమ్మకానికి, నాణ్యతకు మారుపేరుగా శ్రీ వెంకటరమణ సంస్థలకు గుర్తింపు తెచ్చారు కృష్ణయ్య. ఇంటి పేరుకి తగ్గట్టుగా మనిషి కూడా మంచివాడు, సౌమ్యుడు. ఆకట్టుకునే మాటతీరు, అణుకువ కలిగిన ప్రవర్తనతో వ్యాపారరంగంలో రాణించాడు.

కృష్ణయ్యకి భార్య కాశీరత్నమ్మ, కుమార్తెలు సుదర్శన, సుజాత, కుమారులు సురేంద్రబాబు(సూరి), సుబ్బరాయుడు ఉన్నారు. పెద్ద కుమారుడు సూరి 2006 ఆగష్టు 21న చిరు ప్రాయంలోనే ఆకస్మికంగా కన్నుమూశాడు. చెట్టంత కొడుకు కళ్ళ ఎదుటే కన్నుమూయడంతో క్రుంగిపోయాడు కృష్ణయ్య. చిన్న కుమారుడు సుబ్బరాయుడు తండ్రికి తోడుగా వ్యాపారాన్ని విస్తరింపజేశాడు. కొంతకాలం స్వల్ప అనారోగ్యానికి గురై ఆదివారం నాడు కన్ను మూశాడు రాధాకృష్ణయ్య. ఆయన ఆత్మశాంతికై ప్రార్థిస్తూ... వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

## శ్రీసిటీ 'క్రియా' యూనివర్శిటీకి..

# తొలి మహిళా వైస్‌ఛాన్సలర్

## ➤ ప్రొ. నిర్మలారావు నియామకం

ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన పలువురు అత్యుత్తమ విద్యావేత్తలు, దేశంలోని అగ్రశ్రేణి పారి శ్రామికవేత్తల భాగస్వామ్యంతో శ్రీసిటీలో ఏర్పాటై ఉన్న 'క్రియా' విశ్వవిద్యాలయానికి కొత్త వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ నిర్మలారావు నియమితులయ్యారు. ఈ విశ్వవిద్యాలయానికి తొలి మహిళా వైస్‌ఛాన్సలర్‌గా ఆమె నియామకం ఎంతో సంతోషకరమని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా.రవీంద్ర సన్నారెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధి కల్పనలో 50శాతానికి పైగానే మహిళలకు అవకాశం ఇచ్చి మహిళా సాధికారతకు కృషి చేస్తున్నందుకు శ్రీసిటీ..'స్త్రీ సిటీ'గా గుర్తింపు పొందిందని ఆయన పేర్కొంటూ, మహిళలకు మరింత ప్రయోజనకరంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఒక వినూత్నమైన ప్రాజెక్టు రూపుదిద్దుకుంటున్న తరుణంలో క్రియా యూనివర్శిటీకి ప్రొఫెసర్ నిర్మలారావు నియామకం శుభపరిణామమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఆగస్టు 16వ తేది నుంచి ఆమె ఇక్కడ వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని ఆయన తెలిపారు.



### అత్యున్నత విద్యావేత్త ప్రొ. నిర్మలారావు :

మచిలీపట్నానికి చెందిన నిర్మలారావు అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరున్న విద్యావేత్త. 2017 నుంచి ఇటీవలి దాకా బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్‌లో ఆసియా యూనివర్శిటీ ఫర్ ఉమెన్‌కి వైస్‌ఛాన్సలర్‌గా పనిచేశారు. గతంలో ఆమె స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ ప్రోడైరెక్టర్‌గా, యూనివర్శిటీ ఆఫ్ లండన్‌లోని గోల్డ్‌స్మిత్స్ కాలేజీలో అకడమిక్ ప్రో–వార్డెన్‌గా వివిధ పదవులు నిర్వహించారు. 1979లో ఢిల్లీ యూనివర్శిటీలో ఎకనామిక్స్‌లో తొలి డిగ్రీ తీసుకుని, జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ, లండన్ విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి పట్టా పొందారు. ఆమె పలు అంశాలపై రచించిన గ్రంథాలు మంచి ప్రాచుర్యం పొందాయి కూడా.

# వైసిపిలో టిడిపి హవా!

(మొదటి పేజీ తరువాయి)

చొక్కాలు చించుకుని పనిచేసినవారికి గుర్తింపు లేదన్నది వారి అంచనా. పార్టీ కోసం, జగన్ కోసం ఎవరికి తోచిన రీతిలో వాళ్ళు సహాయం చేశారు, పార్టీ ఘన విజయం కోసం తోడ్పడ్డారు. జగన్ నిలబెట్టిన అభ్యర్థుల విజయం కోసం పాటుపడ్డారు. పార్టీకి 151 సీట్లను అందించడంకోసం నిద్రాహారాలు మాని కష్టపడ్డారు. ఇప్పుడు వాళ్లెవరికీ గుర్తింపు లేదు. జగన్‌మోహన్‌రెడ్డి కాదు కదా.. కనీసం పార్టీ 'సలహాదారు'ల అపాయింట్‌మెంట్ కూడా దొరకడంలేదు. శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు అసలు వీరివైపు చూసే పరిస్థితే లేదు. పార్టీ గెలుపుకి మీరు చేసిందేమీ లేదన్నట్లు మాట్లాడుతున్నారు. మొన్న జరిగిన ప్లీనరీలో చెప్పినట్లుగానే, అంతా జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మానే అని బహిరంగంగానే మాట్లాడేస్తున్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి సైతం శాసనసభ్యులకు మంచి మార్కులు పడకుంటే అభ్యర్థులను మార్చేస్తానని పదే పదే చెప్తూనే ఉన్నారు. మీ ఘనత ఏమీ లేదు అంతా నా మహిమే అని చెప్పకనే చెప్తున్నారు. తాను ఎవరిని నిలబెట్టినా తనను చూసి ఓటేస్తారు తప్ప అభ్యర్థిని చూసి కాదన్న సందేశం ఇస్తూనే ఉన్నారు. తాను ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలే తనను గెలిపిస్తాయనే ధీమాను వ్యక్తం చేస్తున్నారు. ఆ పథకాలే రేపటి పార్టీ విజయానికి, నేడు చేస్తున్న బీమా అనే అర్థం వచ్చేలా ప్రజలకి వివరించాలని ప్రతి సమావేశంలోనూ నేతలకు హితోపదేశం చేస్తున్నారు. కష్ట సమయాల్లో అనుగ్రహం కోసం భక్తులు నవగ్రహాల చుట్టూ తిరిగినట్లుగా, తన మంత్రాంగాన్ని, యంత్రాంగాన్నీ నవరత్నాల చుట్టూ తిరగమంటున్నారు సీ.ఎం.

### తెలుగు తమ్ముళ్లదే హవా...

ఇదే తరుణంలో పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతి జిల్లాలోనూ కొత్త చేరికలతో కూడికలు వేస్తూ వస్తున్నారు అధినాయకులు. తమకోసం తమ పార్టీ కోసం చెమటను, రక్తాన్ని ధారబోసిన ద్వితీయశ్రేణి నాయకులను, కార్యకర్తలను గాలికి వదిలేశారు. ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశంలో ఉన్నవారికి గాలం వేసి వారి గొంతెమ్మ కోరికలు తీర్చడానికి అంగీకరించి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. పార్టీ సలహాదారుల దగ్గర తమ పరపతిని, పలుకుబడిని ఉపయోగించి పక్క పార్టీ నుండి వచ్చినవారికే పదవులు కట్టబెడుతున్నారు.

ప్రతిపక్షమే లేకుండా చేస్తున్నామని చంకలు గుద్దుకుంటున్నారు తప్ప, సొంత పార్టీలోనే ప్రతిపక్షాన్ని తయారు చేసుకుంటున్నామన్న విషయాన్ని గ్రహించలేకపోతున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు కీలక పదవులలో ఉన్నవారిని తెచ్చి మళ్ళీ అదే పదవులలో కూర్చోబెడుతున్నారు. వైసీపీలో కూడా టీడీపీదే హవా అన్న మాట సర్వత్రా వినిపిస్తోంది. తాము పడ్డ కష్టానికి కనీస గుర్తింపు కూడా లేదన్న నిరుత్సాహం కూడా పార్టీ వర్గాలలో కనిపిస్తోంది.

### సర్వం.. సకలం.. సమస్తం జగనే..!

'అరవింద సమేత' అన్న సినిమాలో మంత్రి పాత్ర పోషించిన రావు రమేష్ ఒక డైలాగ్ చెప్తాడు 'ప్రతీ 30 సంవత్సరాలకి బ్రతుకు తాలూకు ఆలోచన మారుతుంది. సినిమావాళ్లు దాన్ని ట్రెండ్ అంటారు, వ్యాపారవేత్తలు ఫ్యాషన్ అంటారు, రాజకీయ నాయకులు తరం అంటారు, మామూలు జనం జెనరేషన్ అంటారు... కానీ ప్రతీ జెనరేషన్లోనూ ఒక కొత్త ఆలోచనని ముందుకి తీసుకెళ్ళేవాడు ఒక్కడే వస్తాడు, వాడినే టార్చ్‌బేరర్ అంటారు, ఆ టార్చ్‌బేరరే వీడు' అని హీరోని ఉద్దేశించి అంటాడు. అలా మారిన, మారుతున్న, ఇంకా మారబోతున్న ఆంధ్రా రాజకీయాలకు టార్చ్‌బేరర్‌గా ఆంధ్రా ముఖ్యమంత్రి జగన్‌ని రాజకీయ మేధావులు విశ్లేషిస్తున్నారు.

పార్టీ సలహాదారులు జగన్ దరిదాపుల్లోకి ఆయన శ్రేయోభిలాషులను ఎవరినీ వెళ్ళనీయకపోయినా, సొంత పార్టీ నాయకులు పక్క పార్టీ వాళ్ళను కౌగిలించుకుని వారి బలానికి తోడుగా కొత్త బలగాన్ని జత చేసుకుంటున్నా, పార్టీలో పెరుగుతున్న అసంతృప్తి ఆయన దాకా చేరకపోయినా, తన మంచి కోరేవారిని సైతం ఆయన కలవలేకపోయినా, కష్టాలలో తన వెంట నడిచిన తల్లీ, చెల్లి తోడు లేకపోయినా, తనదైన తరహాలో, తనదైన వ్యూహంతో, తాను నేడు నగదు బదిలీ బటన్ నొక్కితే.. ప్రజలు రేపు ఫ్యాన్ బటన్ నొక్కుతారన్న ధీమాతో భవిష్యత్ రాజకీయాలను శాసించగల టార్చ్‌బేరర్‌గా జగన్‌ని విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

# బ్యాడ్మింటన్ క్రీడాకారుడు..శ్రీనివాస రవికుమార్ కన్నుమూత



నెల్లూరుకు చెందిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కె.శ్రీనివాస రవికుమార్(57) మంగళవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. ఎస్వీ యూనివర్శిటీ బాల్‌బ్యాడ్మింటన్ టోర్నమెంట్లకు ఆయన ప్రాతినిధ్యం వహించడమే కాక, జిల్లాలో ఎందరో బ్యాడ్మింటన్ క్రీడాకారులను తీర్చిదిద్దారు. 1980వ దశకంలో వీఆర్ కళాశాలలో విద్యార్థి దశలోనే ఆయన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారునిగా ప్రసిద్ధి చెందారు. నగరంలోని నవాబుపేట నజీర్‌తోటలోని నివాసంలో శ్రీనివాస రవికుమార్ భౌతికకాయాన్ని నుడా ఛైర్మెన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్, ప్రముఖ న్యాయవాదులు మలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డిలతో పాటు పలు క్రీడా సంఘాల నాయకులు, క్రీడాకారులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆగస్టు 3 నుంచి..

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

## పటిష్టంగా నిర్వహించాలన్న డిఆర్ఓ



ఆగస్టు 3 నుండి 12వ తేది వరకు జరగనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను పటిష్టమైన ఏర్పాట్ల మధ్య సక్రమంగా నిర్వహించాలని జిల్లా రెవిన్యూ అధికారి వెంకట నారాయణమ్మ అధికారులను ఆదేశించారు. ఈనెల 25న కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో ఆ పరీక్షలకు సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. తొలుత ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రాంతీయ తనిఖీ అధికారి, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్ టి.వరప్రసాద రావు మాట్లాడుతూ జిల్లాలో 66 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేశామని, మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 19494, రెండవ సంవత్సరం జనరల్ విద్యార్థులు 8250 మొత్తం కలసి 27744 మంది జనరల్ విద్యార్థులు, రెండు సంవత్సరాల వృత్తి విద్యా విద్యార్థులు మొత్తం 2177 మంది పరీక్షలకు హాజరవుతున్నారని వివరించారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుండి 12 గంటల వరకు, రెండవ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుండి 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిఆర్ఓ, నెల్లూరు నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ డి.చెన్నుడు తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రితజన రక్షకుడు.. శ్రీరాముడు

అవధాని కోట రాజశేఖర్



తనను ఆశ్రయించినవారిని కరుణించి రక్షించిన సౌజన్య మూర్తి, ధర్మపరిపాలకుడు శ్రీరామచంద్రుడని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ధర్మప్రచారపరిషత్ నెల్లూరు జిల్లాశాఖ ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఎన్.దేవరాజులు ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని అరవపాలెంలో విద్యాదాత బీగాల మాలకొండయ్య నిర్మించిన శ్రీషిరిడీ సాయి మందిరంలో ఇటీవల మూడురోజుల పాటు ఆయన ఆధ్యాత్మికోపన్యాసం చేశారు. శ్రీరాముడు ఆశ్రితజనపాలకుడని, తనను ఆశ్రయించిన అహల్యకు శాపవిమోచనాన్ని కలిగించి, నిజరూపాన్ని అనుగ్రహించి భర్తయైన గౌతమమహర్షిని కలుసుకొనే భాగ్యాన్ని కలిగించాడని, సుబాహుడు, ఖరుడు, దూషణుడు, విరాధుడు, కబంధుడు మొదలైన రాక్షసుల వలన కలిగే బాధలనుండి ఋషులకు విముక్తిని కలిగించాడని, సుగ్రీవునికి, విభీషణునికి రాజ్యవైభవాన్ని కలిగించాడని పేర్కొన్నారు. శ్రీరామ పట్టాభిషేకం సందర్భంలో దేవేంద్రుడు వచ్చి శ్రీరాముడిని ఏదైనా వరం కోరుకోమని అంటే, తనను ఆశ్రయించి తన పక్షాన యుద్ధంచేసి ప్రాణాలు కోల్పోయిన వానరులను, భల్లూకాలను బ్రతికించవలసినదిగా కోరి వారిని బ్రతికించాడని, ఇలా ఆశ్రితులను ప్రేమతో రక్షించి శ్రీరా ముడు ఆశ్రితజన రక్షకునిగా కీర్తించబడుతున్నాడని వివరించారు. అనంతరం ఆలయం తరఫున నెల్లటంబాకు వెంకటరమణమ్మ, అనిల్ తదితరులు అవధాని కోట రాజశేఖర్‌ని ఘనంగా సత్కరించారు.

# డా.శివశంకరయ్యకు 'తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్'



మర్రిపాడు మండలం బూదవాడలో మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న డా.మున్నెల్లి శివశంకరయ్యకు తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు లభించింది. మన తెలుగు భాష మాట్లాడే భారత దేశ ప్రాంతాలతో పాటు ప్రపంచంలో 23 దేశాలలో స్థిరపడిన తెలుగు మాట్లాడే ప్రాంతాలలో ఏదైనా ఒక కొత్త విధానాన్ని కనుగొన్నవారికి తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అవార్డును బహూకరిస్తారు. ప్రముఖ సాహితీవేత్త, చరిత్ర పరిశోధకుడైన డా. శివశంకరయ్య నాలుదారాలతో అత్యద్భుతంగా చిత్రాలు వేసే కళా ప్రతిభను మెచ్చుకుని ఆ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ఆయన్ను అభినందించారు.

# గుడిపూడి జంగాల్లా తయారైన ప్రతిపక్షాలు!





మన దేశంలో 'ప్రతి పక్షం' (బీజేపీకి) అనేది మానసికంగా, భౌతికంగా ఎంత బలహీనంగా ఉందో... రాష్ట్రపతి పదవికి ఎన్నిక సందర్భంగా జరిగిన తతంగం కళ్ళకు కట్టినట్టు దేశ ప్రజలకు చూపించింది. అధికార ఎన్డీఏ(అంటే నరేంద్ర మోడీ) అభ్యర్థిని ఢీ కొట్టడానికి అన్నట్టుగా దేశంలోని ఓ పదిహేడు ప్రతిపక్ష పార్టీలు ఓ పదిరోజులు ముందుగానే ప్రయత్నాలు ప్రారంభించాయి. అన్నీ కలిసినా, తమ అభ్యర్థిని రాష్ట్రపతిగా గెలిపించుకోలేవని వాటికి తెలుసు. అయినా బిల్డప్‌కు లోటు లేకుండా వ్యవహరించాయి. సమావేశాలు, డిన్నర్లు, సమాలోచనలతో హడావుడి చేశాయి. ప్రతిపక్షాలు మొత్తం మీద ఇన్నాళ్లకు ఒక తాటి మీదకు వస్తున్న ఇంప్రెషన్‌ను దేశ వాసులకు కలిగించాయి. మరాఠ రాజకీయ నేత శరద్‌పవార్‌కు 'వీరతాడు' వేద్దామని ముందుగా ప్లాన్ చేశారు. ఫలితం ఎలా ఉంటుందో తెలిసిన స్థితప్రజ్ఞుడు గనుక, ఆయన 'సున్నితం'గా ఈ ఆఫర్‌ను తిరస్కరించారు. నిజానికి, ఆ పదవికి పోటీ చేయడానికి శరద్‌పవార్ తగినవారే. ఆయన కాదనడంతో, ప్రతిపక్షాల చూపు కాశ్మీర్ నేత ఫరూక్ అబ్దుల్లాపై పడింది. ఆయన కశ్మీర్ సింహంగా పేరు పొందిన షేక్‌అబ్దుల్లా కుమారుడు. దేశ ప్రజలకు తెలిసిన వాడు. జాతీయ నాయకులందరికీ గౌరవనీయమైన నేత. ఆ పదవికి తగిన స్టేచర్ కలిగిన నేత అనడంలో సందేహం లేదు. అయితే, ఓడిపోయే పోటీలో వేలు పెట్టడం ఎందుకు అని అనుకుని, ఆలోచన దశలోనే ఆయన కూడా తప్పుకున్నారు.

దీంతో, బెంగాలమ్మ మమతా బెనర్జీ రంగంలోకి దిగారు. రాజకీయ జీవితమంతా బీజేపీతో గడిపి, మోడీతో విభేదించి, చివరకు తృణమూల్ కాంగ్రెస్ పంచన చేరిన యశ్వంత్‌సిన్హాను రంగంలోకి దించారు. నిజానికి, యశ్వంత్ సిన్హా – భారత రాష్ట్రపతి పదవికి అత్యుత్తమ అభ్యర్థి. ఐఏఎస్ అధికారిగా పనిచేసిన అనుభవంతో పాటు, భారత ఆర్థిక, విదేశీ మంత్రిగా వాజపేయి మంత్రివర్గంలో పనిచేసిన అనుభవం ఆయన సొంతం. పాలనాదక్షుడిగా బీజేపీలో పేరు తెచ్చుకున్నారు. కాకపోతే, ఆయన 'ఏ రైట్ కాండిడేట్ ఇన్ ది రాంగ్ హాండ్స్' అయిపోయారు.

ఈ విషయంలో ప్రతిపక్షాల హడావుడిని పూర్తి కానిచ్చి ప్రధాని మోడీ తన ట్రంప్ కార్డును తాపీగా బయటకు తీశారు. ఎవరి అంచనాలకూ అందని రీతిలో ఓ గిరిజన మహిళను తమ అభ్యర్థిగా ఆయన తెరమీదకు తీసుకువచ్చారు. దీంతో, ప్రతిపక్షాలు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాయి.

'రాష్ట్రపతి అభ్యర్థి'అంటే హై ప్రొఫైల్ అభ్యర్థి అని ఫిక్స్ అయిపోయిన ప్రతిపక్షాలు అటువంటి 'హై ప్రొఫైల్' అభ్యర్థి కోసం వెదుకులాడుతూ వచ్చాయి. అందుకే, శరద్‌పవార్, ఫరూక్ అబ్దుల్లా, యశ్వంత్ సిన్హా.. అంటూ తర్జన భర్జనలు పడి, చివరకు యశ్వంత్ సిన్హాను రంగంలోకి దించాయి. దేశంలో అత్యున్నత రాజ్యాంగ పదవికి అత్యుత్తమ అభ్యర్థిని ఎంపిక చేశామంటూ ఆనందం వ్యక్తం చేశాయి. తమ అభ్యర్థిని బలపరచాలంటూ మోడీకి కూడా విజ్ఞప్తి చేశాయి.నిజానికి, నిజం కూడా అంతే.




అయితే, గత ఎనిమిదేళ్లుగా ప్రతిపక్షాలను ముప్పుతిప్పలు పెడుతూ మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్న ప్రధాని, ఈ పదవికి తమ అభ్యర్థిని ఎంపిక చేసే విషయంలో మరోసారి చావు దెబ్బ తీశారు. ఇది వారికి కలలో సైతం ఊహించని పరిణామం.

ఒక మామూలు గిరిజన మహిళను, అనేక విషాదాల నడుమ, దాదాపు ఒంటరి జీవితాన్ని గడుపుతూ, మానసిక ప్రశాంతత కోసం బ్రహ్మకుమారీల బోధనల మధ్య స్వాంతన పొందుతున్న ఓ 64 సంవత్సరాల ఆదివాసి మహిళను నరేంద్ర మోడీ భారత 15వ రాష్ట్రపతి పదవికి ఎన్డీఏ అభ్యర్థిగా ఎంపిక చేశారు. జార్ఖండ్ రాష్ట్రానికి ఆమె గతంలో గవర్నర్‌గా పని చేశారు. ప్రస్తుతం తన స్వగ్రహంలో కుమార్తెతో కలిసి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇద్దరు కుమారులు, భర్తను కూడా కోల్పోయి ఇక మిగిలిన కుమార్తెతో రాజకీయాలకు దూరంగా ప్రశాంత జీవనం గడుపుతున్న శ్రీమతి ద్రౌపది ముర్మును ఈ పదవికి ఎంపిక చేయడంతో... ఇది ఊహించని ప్రతిపక్షాలు చెట్టుకొకటి, పుట్టకొకటిగా చెల్లా చెదురైపోయాయి.

ఎంతలా అంటే... ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా యశ్వంత్ సిన్హాను బలపరిచిన జార్ఖండ్ ముక్తి మోర్చా పార్టీ, ఆయనను నట్టేట్లో వదిలేసి అధికారపక్ష అభ్యర్థి శ్రీమతి ద్రౌపది ముర్ముకు ఓట్ వేసింది. ప్రతిపక్షాలలోని అనేక పార్టీలు ఆమెకు ఓట్ వేశాయి. ప్రతి పక్షాలకు చెందిన అనేకమంది ఎం.పీలు, ఎం.ఎల్.ఏలు క్రాస్ ఓటింగ్ చేశారు.

నరేంద్ర మోడీ వేసిన ఎత్తుకు ప్రతిపక్షాలు చిత్తు చిత్తు అయిపోయాయి.

ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రతిపక్షాలు కాంగ్రెస్ విశ్రాంత నేత అయిన మార్గరెట్ అల్వాను ఎంపిక చేశారు. ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తెచ్చి, తన పల్లకీ మోయించుకోవాలని అత్యుత్సాహంలో పడిపోయిన బెంగాలమ్మ మమత బెనర్జీ తాము మార్గరెట్ అల్వాకు మద్దతు ఇవ్వమని ప్రకటించారు. అధికారపక్ష అభ్యర్థి అయిన బెంగాల్ గవర్నర్‌కు లాభం కలిగేలా... ఓటింగ్‌లో పాల్గొనబోమని తృణమూల్ కాంగ్రెస్ ప్రకటించింది. ఇదీ ప్రతిపక్షాల 'ఐక్యత'.

తాము నరేంద్ర మోడీని ఎదిరించి బతికి బట్ట కట్టలేమని చాలా ప్రతిపక్షాలకు ఇప్పటికే అర్థమైంది. దేశంలో చిన్న, చితక మొత్తం అరవైకిపైగా ఈ రాజకీయ పార్టీలు ఉన్నాయి. చాలా ప్రతిపక్షాలు 'ఉన్న చోట ఉండనిచ్చి.... తింటున్న దానిని తిననిస్తే చాలు దేముడా...' అనే స్థాయిలో ఉన్నాయి.

మోడీని వ్యతిరేకించడానికి ఓ నలుగురైదుగురు ప్రతిపక్ష నాయకులు నిలబడాలని భావిస్తున్నప్పటికీ వారు ఒక తాటి మీదకు రాలేకపోతున్నారు. అందరూ 'ప్రధాన మంత్రి' అభ్యర్థులు కావడమే ఇందుకు కారణం.

కాలం, ఖర్మం కలిసి వస్తే, ప్రధాని కావాలని అభిలషించే వారిలో రాహుల్‌గాంధీ(కాంగ్రెస్), మమతా బెనర్జీ(తృణమూల్ కాంగ్రెస్), శరద్‌పవార్(మహారాష్ట్ర), నితీష్‌కుమార్(ప్రస్తుతానికి అధికార పక్షమే గానీ, వెయిటింగ్‌లో ఉన్నారు. బీహార్ జనతాదళ్), కేసీఆర్(టీఆర్ఎస్) ఉన్నారు. ప్రధాని పీఠం అధిష్టించాలనే అభిలాష గట్టిగానే ఉందిగానీ దానికి దారి ఎటో వారికి తెలియడం లేదు.

అందుకే, ప్రధాని నరేంద్ర మోడీ వారితో ఆడుకుంటున్నారు. వేళాకోళం చేస్తున్నారు. తృణప్రాయంగా తీసి పారేస్తున్నారు. వారికి దేశభక్తి లేదని, దేశం కంటే స్వప్రయోజనాలే ప్రతిపక్షాలకు ముఖ్యమని మోడీ ఈసడిస్తున్నారు. దెబ్బ పొడుస్తున్నారు. ఎవరైనా గట్టిగా తోకలాడిస్తే, ఈడీ, సీబీఐ అనే రేసు కుక్కల్ని వదులుతున్నారు. మొన్ననే ఓ బెంగాల్ మంత్రి పార్థ చటర్జీపై ఈడీని వదిలారు. మంత్రి గారి కి'లేడీ' సహాయకురాలు అర్పిత కొంపలో ఈడీ అధికారులు ఓ కరెన్సీ గుట్టను బయటికి లాగారు. ఇరవై కోట్లకు పైబడి ఉన్న ఆ గుట్టను 45 ట్రక్కుల్లో తరలించారట. నెహ్రూ, ఇందిరాగాంధీ వారసుల పుణ్యమా అని మన నేతలు ఓ అయిదారు తరాలకు సరిపడా బాగానే వెనకేసుకున్నారని కర్ణాటక మాజీస్పీకర్ రమేష్‌కుమార్ ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పారు.

ఇప్పుడు వారిలో చాలామంది ప్రతిపక్షాల అవతారం ఎత్తారు. అన్ని ప్రతిపక్షాల్లోని కీలక నేతలు దాదాపుగా కాంగ్రెస్ అనే బురద గుంటలోంచి పుట్టుకు వచ్చిన వారేనన్నది ఓ విశ్లేషణ. అక్కడ తొండలుగా పుట్టి, తరువాత బాగా ముదిరి, ప్రతిపక్ష ఊసరవెల్లులు అయిన వారే ఎక్కువ.

దీంతో, నరేంద్ర మోడీ అనే సునామీని తట్టుకొని ఇప్పటికి నిలబడితే, తరువాత సంగతి తరువాత చూసుకోవచ్చునన్నంత ఆత్మరక్షణలో వారు పడిపోయారు. ఫలితంగా ప్రతిపక్షాలు వాటికీ పనికి రావడం లేదు... ప్రజలకూ పనికి రావడం లేదు. ఆ సంగతి మోడీకి తెలిసిపోయింది. అందుకే, 'ఏ విషయంలోనూ... ఏ సందర్భంలోనూ 'గుడిపూడి జంగాల'లాగా తయారైన ప్రతిపక్షాలను మోడీ విశ్వాసంలోకి తీసుకోవడం లేదు. 'అఖిలపక్ష సమావేశం' అనే మాట మోడీ డిక్షనరీలోనుంచి ఎగిరిపోయింది.

సామెతలకు, పిట్ట కథలకు, పొడుపు కథలకు పుట్టినిల్లయిన కోస్తా ఆంధ్రాలో 'గుడిపూడి జంగాలు' అని ఓ పిట్ట కథ ప్రచారంలో ఉంది. ఇల్లు, వాకిలీ లేని కొంతమంది ఆవారాలు పగలంతా గ్రామంలో భిక్షం ఎత్తుకుని, రాత్రికి గ్రామంలోని గుడి అరుగుల మీదకు చేరేవారంట, విశ్రమించడానికి.

అందరూ, అరుగుల మీదకు చేరి, గంజాయి దమ్ము కొడుతూ 'దేశాన్ని బాగు చేయడం ఎలా? అమెరికా ప్రెసిడెంటు ఎవరైతే బాగుంటుంది, ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధం ఆపడానికి ఏం చెయ్యాలి? ఈసారి చంద్రబాబుకు ఓటేద్దామా... జగన్‌కా?' అంటూ అనేక అంశాలపై నిద్ర వచ్చేదాకా సీరియస్‌గా 'చర్చించి' నిద్రపోయేవారంట. తెల్లవారగానే లేచి, ఎవరి జోలె వారు తీసుకుని భిక్షాటన కోసం ఊళ్ళోకి వెళ్లిపోయేవారట. వీరినే 'గుడిపూడి జంగాలు' అంటుంటారు.

అలాగే, ఎవరి రాజకీయం వారు చేసుకుంటూ... ఎవరి పాలు వారు పిండుకుంటూ మధ్యమధ్యలో 'దేశము.. సమస్యలు... ప్రజలు.... కష్టాలు....' అంటూ వీరు చేస్తున్న ఉత్తుత్తి ప్రయత్నాల ఫలితంగా ప్రతిపక్షాలకు విశ్వసనీయత లేకుండా పోయింది. విశ్వసనీయత లేకుండా పోవడానికి ప్రధాన కారణం 'పొలిటికల్ క్యారెక్టర్' లేకపోవడం. 'మీ ఇంటికొస్తే మాకేం పెడతావ్? మా ఇంటికొస్తే మాకేం తెస్తావ్' దృక్పథంలో బాగా ముదిరిపోయి ఉండటంతో, రోజురోజుకీ భారత ప్రతిపక్షాలు ప్రజల దృష్టిలో చులకన అవుతున్నాయి. దేశ ప్రయోజనాల రీత్యా ఏదైనా ఒక ఉమ్మడి నిర్ణయం తీసుకోలేకపోతున్నాయి. అదే దేశ దౌర్భాగ్యం.

**- భోగాది వేంకట రాయుడు**








## హైదరాబాదులోని నెల్లూరు ప్రముఖుల నివాసాలలో

# 'శ్రీ శక్తి నారాయణి అమ్మ'కి భక్తి నీరాజనాలు




తమిళనాడు రాయవేలూరు సమీపంలో ఉన్న ప్రఖ్యాత పుణ్యక్షేత్రం 'శ్రీపురం'లోని 'నారాయణ పీఠం' వ్యవస్థాపకులు 'శ్రీ శక్తి నారాయణి అమ్మ' జులై 15వతేది నుండి కొన్ని రోజుల పాటు హైదరాబాదులో బసచేసి, పలువురి నివాసాలు సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించి పాదపూజలు అందుకున్నారు. సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందింపచేయడమే కాకుండా, సమాజ సేవ, సమ సమాజ స్థాపన, ధర్మ సంస్థాపన తదితర అంశాలకు ప్రాధాన్యత కల్పిస్తున్న 'అమ్మ' ఆగమనంతో పలు నెల్లూరీయుల నివాసాలు పునీతమై వారి జీవితాలు ధన్యమయ్యాయి. శ్రీపురంలో 100 ఎకరాల విస్తీర్ణంలోని సువిశాల ప్రాంగణంలో 'నారాయణ పీఠం' ఏర్పాటు చేసి, శక్తి అమ్మవారి స్వర్ణ దేవాలయాన్ని నిర్మించారు శ్రీ నారాయణి అమ్మ. అక్కడే విద్య, వైద్యం, స్వయం ఉపాధి వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తూ అక్కడకు వచ్చే భక్తులకు అనుగ్రహభాషణం చేయడం ఆయన నిత్యకృత్యం. శాంతా బయోటెక్నిక్స్ వ్యవస్థాపక ఛైర్మెన్ డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి – వసంత దంపతులతో పాటు అమ్మవారి ఇతర భక్తుల కోరిక మేరకు ఆయన తొలిసారిగా తన శిష్య బృందంతో హైదరాబాదుకు వచ్చారు.

జులై 15 నుండి 22వతేది వరకూ వరప్రసాద్‌రెడ్డి నివాసంలో బసచేసి నిత్యపూజా కార్యక్రమాలలో పాల్గొనడంతో పాటు, అమ్మ దర్శనార్థం అక్కడకు వచ్చిన వారికి అనుగ్రహ భాషణం చేశారు. ప్రతిరోజు ఒకరిద్దరి భక్తుల ఇళ్ళకు వెళ్ళి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 22వ తేదీ మరో నెల్లూరీయులు ఏ.ఎం.ఆర్. సంస్థ ఛైర్మెన్ ఆల్లూరు మహేష్‌రెడ్డి–రాధిక దంపతుల ఇంటికి వెళ్ళి అక్కడ బసచేశారు. 23వతేదీ మహేష్‌రెడ్డి నివాసంలో అనేక మంది మహేష్ కుటుంబసభ్యులు, వారి హితులు, సన్నిహితులు భక్తితో ఆమ్మను దర్శించుకుని నీరాజనాలు అర్పించారు. మహేష్‌రెడ్డి నివాసంలో అమ్మను దర్శించిన వారిలో ప్రముఖ హీరో అక్కినేని నాగార్జున కూడా ఉన్నారు.



వరప్రసాద్‌రెడ్డి – వసంత, మహేష్‌రెడ్డి – రాధిక దంపతులతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి – స్వర్ణమ్మ, కెన్సెస్ నిర్మాణ సంస్థల సారధులలో ఒకరైన సుధాకరరెడ్డి – అనితమ్మ, భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కుమారుడు హర్షవర్ధన్ – రాధమ్మ దంపతులు కూడా అమ్మను ఆహ్వానించి పాదపుజ చేశారు.

హైదరాబాదు వంటి మహానగరంలో ఉంటూ తమతమ వ్యాపార వ్యాపకాలతో క్షణం తీరిక లేకుండా గడిపే నగర ప్రముఖులకున్న భక్తితత్వాన్ని చూసి ముగ్ధులైన అమ్మ, తన దర్శనార్థం వచ్చిన వారందరినీ ఆశీర్వదించి అభిభాషణం చేశారు. దాదాపు ఒకటిన్నర దశాబ్దకాలంగా వరప్రసాద్‌రెడ్డి దంపతులు తనను తెలుగు రాష్ట్రాలను సందర్శించవలసిందిగా ఆహ్వానిస్తున్నారని, వారి కోరిక మేరకే ఇప్పుడు రావడం జరిగిందని, శ్రీ శక్తి నారాయణి అమ్మ తమ ఉపన్యాసంలో ప్రత్యేకంగా పేర్కొనడం గమనార్హం.








Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com